ప్రజాశక్తి
మంగళవారం 15 అక్టోబర్ 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

ఫలించిన సిండికేట్ల వ్యూహం

- అధికార పార్టీ నేతల బినామీలకే అధిక దుకాణాలు
- గుంటూరు, నరసరావుపేటలో లాటరీ ద్వారా కేటాయింపులు
- మహిళల పేరుతోనే దరఖాస్తులు - స్థానికేతరులకు దక్కిన ఛాన్సు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

మద్యం దుకాణాల కోసం సిండికేట్ల వ్యూహం ఫలించింది. దుకాణం లైసెన్సు కైవసం చేసుకునేందుకు తమ అనుచరులతో ఎక్కువగా దరఖాస్తులు చేయించిన అధికార పార్టీ నాయకులు ఎవరికి దుకాణం వచ్చినా తమకే అన్నట్టుగా వ్యవహరించారు. దీంతో చాలాచోట్ల వారు అవలంభించిన ఎత్తుగడలు ఫలించాయి. తద్వారా మద్యం విక్రయాలపై తమ ఆధిపత్యం ఉండాలన్న లక్ష్యం నెరవేరింది. మహిళల పేరున కొంతమంది దరఖాస్తులు దాఖలు చేయగా వారికి కూడా కేటాయింపులు జరిగాయి. ఖమ్మం జిల్లాకు చెందిన ఒక మహిళకు దుగ్గిరాల దుకాణం దక్కడం, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు మహిళలు మంగళగిరి నుంచి దరఖాస్తు చేయగా వీరికి లాటరీలో దుకాణాలు దక్కడం గమనార్హం.

గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవతేజ దుకాణాల కేటాయింపునకు లాటరీ తీశారు. జిల్లాలో మొత్తం 127 మద్యం దుకాణాలకు గాను 4448 దరఖాస్తులు రాగా 127 మంది వ్యాపారుల ఎంపిక లాటరీ ప్రక్రియ ద్వారా నిర్వహించారు. ఈ లాటరీని పాల్గొన్న దరఖాస్తు దారులు ఒక్కో దుకాణానికి ఫీజు రూ.2 లక్షల చెల్లించారు. తద్వారా కేవలం దరఖాస్తుల నుంచి ప్రభుత్వానికి రూ.88.96 కోట్ల ఆదాయం వచ్చింది. దరఖాస్తు దారులకు కేటాయించిన టోకెన్‌లను లాటరీ ద్వారా షాపులను ఎంపిక చేశారు. లాటరీలో పేరొచ్చిన వారు 6వ వంతు లైసెన్స్ ఫీజును చెల్లించారు. వార్షిక లైసెన్స్ ఫీజు రూపేణా ప్రభుత్వానికి రూ.87.75 కోట్ల ఆదాయం చేకురింది. వీరికి ఈనెల 16వ తేదీ నుంచి షాపుల నిర్వహణకు లైసెన్స్‌లు జారీచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, ప్రొబేషనరీ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ కుమారి, అసిస్టెంట్ ప్రొబేషనరీ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మారయ్య బాబు పాల్గొన్నారు. పల్నాడు జిల్లాలో 129 దుకాణాలకు 2639 దరఖాస్తులు రాగా నరసరావుపేట టౌన్‌హాలులో పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ జి.సూరజ్ ధనుంజయ్, జిల్లా ఎక్సైజ్ శాఖాధికారి కె.మణికంఠ లాటరీ ద్వారా 129 మంది లైసెన్సుదారులను ఎంపిక చేశారు. పల్నాడు జిల్లాలలో ప్రభుత్వానికి దరఖాస్తుల ద్వారానే రూ.52.60 కోట్ల ఆదాయం వచ్చింది. దుకాణాలకు లైసెన్సు ఫీజులో ఆరోవంతు మంగళవారం ఉదయంలోగా చెల్లించి ప్రాథమిక లైసెన్సు పొందాలని ఎక్సైజ్ శాఖాధికారి మణికంఠ కోరారు.

నరసరావుపేట, గుంటూరులో లాటరీ అధికారులు

కాకుమాను మండలంలోని పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

రైతుల గుండెల్లో అల్పపీడన రైళ్లు

- గుంటూరు, పల్నాడు జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం
- వానలతో పైర్లకు ముప్పు - సమస్య వస్తే దిగుబడులకు భారీ దెబ్బ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సోమవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ఒక మోస్తరుగా వర్షాలు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రెండు జిల్లాల పరిధిలో చలి గాలులు ప్రారంభమయ్యాయి. మరోవైపు ముసురు వాతావరణం ఏర్పడింది. వర్షాలతో రహదారుల పక్కన వ్యాపారం చేసుకునే చిరువ్యాపారులు నష్టపోతున్నారు. తెనాలి, గుంటూరు ప్రాంతాల్లో ఒక మోస్తరు భారీ వర్షం కురవగా మిగతా ప్రాంతాల్లో ఒక మోస్తరుగా వర్షం కురిసింది.

ఆగస్టు 31న కురిసిన అతి భారీ వర్షాలతో గుంటూరు జిల్లాలో 83 వేల ఎకరాల్లో పంటలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం 42 వేల ఎకరాల్లోనే నష్టం నిర్ధారించినా మిగతా 41వేల ఎకరాల్లోకూడా రైతులకు పంట చేతికివచ్చే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో మళ్లీ భారీ వర్షాలు, తుపాను వస్తుందని వాతావరణ శాఖ నుంచి వస్తున్న సమాచారంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ప్రధానంగా డెల్టాలో వరి కోతలకు సిద్ధం అవుతోంది. ఖరీఫ్ ప్రారంభంలో సాగు చేసిన వరి, మినుము, పెసర, శనగ తదితర పంటలు వచ్చేనెలలో కోతలకు రానున్నాయి. ఈ దశలో భారీ వర్షాలు కురిసి మళ్లీ పైర్లు మునిగితే పంట ఎందుకు పనికిరాకుండా పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు పల్నాడు, గుంటూరు జిల్లాలోని మెట్ట ప్రాంతంలో పత్తి తీయడానికి సిద్ధంగా ఉన్న ప్రాంతాల్లో నేలపాలయ్యే అవకాశం ఉంది. అంతేగాక కాయలు కుళ్లిపోవడం, బూజువేయడం, పూత రాలిపోయి దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉంది. మిర్చి ఉరకెత్తే అవకాశం ఉంది. అపరాలు నీట మునిగితే ఎందుకు పనికిరాకుండా పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గుంటూరు జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి

2లో

పురుగు మందులు సీజ్ చేస్తున్న వ్యవసాయ అధికారులు

418 లీటర్ల పురుగు మందులు సీజ్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

అనుమతులేమీ లేకుండా గోదాములో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.5 లక్షల 85 వేల 240 విలువగల 418.6 లీటర్ల వివిధ కంపెనీలకు చెందిన పురుగు మందులను వ్యవసాయ అధికారులు సోమవారం సీజ్ చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని వడ్డవల్లి ప్రాంతంలోని ఆంజనేయ స్వామి గుడి ప్రాంతం గోదాముల్లో సత్తెనపల్లి సబ్ డివిజన్ ఇన్‌ఛార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీధర్‌రెడ్డి, వడ్డవల్లి వీఆర్వో అనిల్ సమక్షంలో తనఖీ చేశారు. సత్తెనపల్లి పట్టణానికి చెందిన శివశంకర ఫర్టిలైజర్‌కు సంబంధించిన పురుగు మందులను సీజ్ చేశారు. ఈ ఫర్టి లైజర్‌కు పురుగు మందుల లైసెన్స్ కాఫీ నందు గోడౌన్ అడ్రస్ జత పరిచి లేనందున, పురుగు మందులు మొత్తాన్ని అనధికార నిల్వలుగా నిర్ధారించారు. సీజ్ చేసిన పురుగు మందులను నాణ్యతా పరీక్షల నిమిత్తం ఒక్కొక్క బ్యాచ్ నుండి ఒక్కో నమూనాను లాబ్‌కు పంపినట్లు అధికార్లు తెలిపారు. సీజ్ చేసిన పురుగు మందులను భద్రతా నిమిత్తం సత్తెనపల్లి పట్టణంలోని ఆదిత్య సీడ్స్ అనే పురుగు మందుల షాపునకు అప్పగించినట్లు శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

సమకాలీన రాజకీయ అంశాలపై 21న సభ

ప్రజాశక్తి-గుంటూరు

సమకాలీన రాజకీయ పరిణామాలపై ఈనెల 21న సాయంత్రం 4గంటలకు గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపు నిచ్చారు. సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్.బాబురావు తదితరులు ప్రసంగిస్తారన్నారు. బ్రాడీపేటలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు అధ్యక్షతన జిల్లా విస్తృత సమావేశం సోమవారం నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోలు, డీజిల్, వంట

2లో

మాట్లాడుతున్న రామారావు

హాజరు కానున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

కృష్ణానదికి వరద హెచ్చరిక

ప్రజాశక్తి-తాడేపల్లి

మహారాష్ట్ర, తెలంగాణలో కురుస్తున్న వర్షాల వల్ల కృష్ణా నదికి మళ్లీ వరద వచ్చింది. సోమవారం ప్రకాశం బ్యారేజీకీ 45 వేల క్యూసెక్కులు వరద నీరు వస్తున్నట్లు బ్యారేజ్ ఏఈ దినేష్ తెలిపారు. అదేమొత్తంలో నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలో నివాసముంటున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాడేపల్లి తహశీల్దార్ ఒక ప్రకటనలో కోరారు. మత్స్యకారులెవరూ నదిలోకి చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

వ్యవసాయాభివృద్ధికి నాబార్డు సహకారం అవసరం : పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం నాబార్డు ద్వారా అమలు చేసే ప్రాజెక్టులపై రైతులకు అవగాహన కల్పించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నసరావుపేటలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సమయంలో తప్పనిసరిగా అవగాహన కార్యక్రమం ఉండేలా చూడాలన్నారు. ఈ మేరకు నాబార్డు ప్రాజెక్టులపై సమీక్షించారు. జిల్లాలో వాటర్ షెడ్ పథకాలు, గిడ్డంగుల నిర్మాణాలు, ఎఫ్పీవోల నిర్వహణ గ్రాంట్లు, విలేజ్ మార్ట్‌ల నిర్మాణాలు, మారుమూల గ్రామాల్లో మైక్రో ఏటీఎంల ఏర్పాటు, గిరిజన ప్రాంతాల్లో పండ్ల తోటల నిర్వహణ వంటి విషయాల్లో నాబార్డు సహకారం అవసరం ఉందన్నారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాదారులకు సైతం నాబార్డు రుణాలు అందించే విషయంలో సానుకూల నిర్ణయం కోసం రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశానికి విజ్ఞప్తి చేస్తామన్నారు. నాబార్డు అధికారులు అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయంతో పని చేయడం ద్వారా ఎక్కువ సంఖ్యలో రైతులకు, మహిళలకు గ్రాంట్లు, సబ్సిడీ రుణాల వంటి ఆర్థిక ప్రయోజనాలు అందించవచ్చని అన్నారు. కార్యక్రమంలో నాబార్డు డిడిఎం శరత్ బాబు, డీఆర్డీఎ పీడీ బాలు నాయక్, ఎల్డీఎం రాంప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు, వ్యవసాయాధికారి మురళి, ఉద్యానాధికారి రమణారెడ్డి, పశుసంవర్ధక శాఖాధికారి కాంతారావు, సూక్ష్మ నీటిపారుదల అధికారి ఆంజనేయులు, మత్స్య శాఖాధికారి సంజీవరావు, సహకార అధికారి వెంకటరమణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.అరుణ్‌బాబు, హాజరైన అధికారులు

సమర్థవంతంగా పని చేసిన రామచంద్రరాజు

ఎస్పీగా ప్రమోషన్‌పై వెళ్తున్న సందర్భంగా సత్కారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ (ఆర్మ్‌డ్ రిజర్వ్)గా విధులు నిర్వహిస్తూ ఎస్పీగా ప్రమోషన్ పొందిన డి.రామచంద్రరాజును నరసరావుపేటలోని జిల్లా పోలీసు కార్యాలయంలో పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు సోమవారం సత్కరించారు. 1991లో పోలీసు శాఖలో చేరిన రామచంద్రరాజు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పలుచోట్ల పని చేశారు. పల్నాడు జిల్లా ఆవిర్భావం నుండి అదనపు ఎస్పీగా విధులు నిర్వహిస్తూ ప్రస్తుతం ఎస్పీగా ప్రమోషన్ పొంది (పిటిసి) విజయనగరానికి బదిలీ అయ్యారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రామచంద్రరాజు నీతి నిజాయితీలతో పాటు క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అని, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని అభినందించారు. పోలీస్ ఉద్యోగం అంటే ఇతర ఉద్యోగాల వంటిది కాదని, ఎన్నో కష్టనష్టాలు, ఒడిదుడుకులు చవిచూడాల్సి ఉంటుందని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో పోలీస్ శాఖకు ఉన్నతమైన సేవలను అందించి అందరికి అదర్శవంతులుగా నిలిచారని రామచంద్రరాజును అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (క్రైమ్) లక్ష్మీపతి, పరిపాలన విభాగం అదనపు ఎస్పీ జె.వి సంతోష్, నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు, ఆర్మ్డ్ రిజర్వు డీఎస్పీ గాంధీరెడ్డి, సీఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రరాజును సత్కరిస్తున్న ఎస్‌పి కె.శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు

కబ్జా యత్నం.. తెలుగు తల్లి విగ్రహానికి అవమానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణం మున్సిపల్ స్థలంలో ఉన్న తెలుగుతల్లి విగ్రహం ఏర్పాటు చేసిన స్థలంపై కన్నేసిన అధికార పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్ ఏకంగా రాత్రికి రాత్రి తెలుగు తల్లి విగ్రహాన్ని తొలగించి పక్కనే ఉన్న గాంధీ పార్క్‌లో పడేశారు. ఈ చర్యపై ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలుగు తల్లి విగ్రహం తొలగింపు విషయాన్ని మున్సిపల్ కమిషనర్ జస్వంతరావును వివరణ కోరగా తెలుగు తల్లి విగ్రహం ఉన్న ప్రాంతంలో మూత్ర విసర్జన చేస్తున్నారని, అందుకే మారుస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని అన్నారు. తెలుగుతల్లి విగ్రహాన్ని తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని, అదే స్థానంలో తిరిగి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మూత్ర విసర్జన జరగకుండా ఏర్పాట్లు చేయాలేగాని విగ్రహ తొలగింపు కాదని, దీనిపై నిర్లక్ష్యం చేస్తు ఉద్యమిస్తామని అంటున్నారు.

సమకాలీన రాజకీయ అంశాలపై 21న సభ

(మొదటి పేజీ తరువాయి)

గ్యాస్ ధరలు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతు న్నాయన్నారు. క్రిమినల్ చట్టాలలో మార్పులు తెచ్చి ఉద్యమకారులపై నిర్బంధాన్ని ప్రయోగించే చర్యలు చేపట్టారని, మహిళలు, దళితులు, మైనార్టీలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోయాయని విమర్శించారు. ఈ విధానాలనకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలన్నారు. రాష్ట్రంలో ఇసుక కొరత తీవ్రంగా వుందని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు వాగ్దానం చేసిన విధంగా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని కోరారు. ధరలను నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ప్రజా సమస్యలను ప్రక్కదారి పట్టించే విధంగా సున్నితమైన అంశాలను రెచ్చగొడుతోందని మండిపడ్డారు. విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రూ.8100 కోట్లు ప్రజలపై భారాలు మోపే యత్నాన్ని విరమించాలని, డిమాండ్ చేశారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఈనెల 18న విద్యుత్ సంస్థల కార్యాలయాల వద్ద జరిగే నిరసన కార్యక్రమాల్లో అన్ని రంగాల ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. భారీ వర్షాలు, వరదల్లో నష్టపోయిన రైతులకు, కౌలు రైతులకు వరికి ఎకరాకు రూ.25 వేలు, వ్యాపార పంటలకు రూ.లక్ష చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, తాడేపల్లి సుందరయ్యనగర్, మహానాడు ప్రాంతాలలో పూర్తిగా మునిగిన ఇళ్ళకు రూ.25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని, అర్హులైన పేదలందరికీ, ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ సమావేశం తీర్మానించింది. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి, ఎన్.భావన్నారాయణ, కె.నళినీకాంత్, ఎం.రవి, నాయకులు బి.కోటేశ్వరి, బి.వెంకటేశ్వరరావు, ఎమ్.ఎ.చిస్టీ, ఎల్.అరుణ పాల్గొన్నారు.

రైతుల గుండెల్లో అల్పపీడన రైళ్లు

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం ఉదయం వరకు కొల్లిపరలో29.4, కాకుమానులో 26.8, చేబ్రోలులో 15.2, తెనాలి 7.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అయితే ఉదయం 8 గంటల తరువాత రాత్రి పొద్దుపోయే వరకు విడతల వారీగా వివిధ ప్రాంతాల్లో ఒక మోస్తరు జల్లుల నుంచి భారీ వర్షం నమోదు అవుతోంది. గుంటూరు నగరంలోపలు ప్రాంతాల్లో ముంపు సమస్య పొంచి ఉండటంతో నగరపాలక సంస్థ కార్యాలయంలో కంట్రోలు రూమ్ ఏర్పాటు చేసినట్టు కమిషనర్ పి.శ్రీనివాసులు తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండ నియోజకర్గంలోని దాదాపు అన్ని మండలాల్లో భారీ వర్షం కురిసింది. మిగతా ప్రాంతాల్లో ఒక మోస్తరుగా వర్షం పడింది. పల్నాడు జిల్లాలోని సోమవారం ఉదయం 8గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు నమోదైనన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి...

ముప్పాళ్లలో అత్యధికంగా 45.6 మిల్లీ మీటర్లు, ఈపూరు 28.6, నూజెండ్ల 26.8, వినుకొండ 25.4, శావల్యాపురం 10.6, నాదెండ్ల 19, చిలకలూరిపేట 23.2, యడ్లపాడు 16.2, బొల్లాపల్లి 8.4 వర్షపాతం నమోదు అయింది. అలాగే ఆదివారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు స్వల్ప వర్షంపాతం నమోదైంది. దాచేపల్లిలో అత్యధికంగా 19.2, దుర్గిలో 11.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

గుంటూరు నగరంలో వాన

సర్వేయర్ వెంకటేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే

లంచం తీసుకున్నా సర్వే చేయడం లేదు

ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేకు ఫిర్యాదు

ప్రజాశక్తి-ఈపూరు

ప్రజలను లంచాల పేరుతో పీడించి ఇబ్బంది పెట్టే ఉద్యోగులపై శాఖపరమైన చర్యలు తప్పవని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హెచ్చరించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు సోమవారం ప్రజాదర్బార్‌లో ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాల అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామ సర్వేయర్ వెంకటేష్ సర్వే నిమిత్తం తనతోపాటు కొంతమంది వద్దనుండి వేల రూపాయలు డబ్బులు వసూలు చేసినా పనులు మాత్రం చేయకుండా కార్యాలయం చుట్టూ తిప్పుతున్నాడని ఎవనికుంటకు చెందిన రైతు బచ్చునబోయిన యోగయ్య ఫిర్యాదు చేశారు. సర్వేయర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే భూ సమస్యలపై అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ ఎ.నలినీని ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా ఇన్‌ఛార్జి పీడీ ఇ.బూసిరెడ్డి, ఎంపిడిఒ ప్రభాకర్‌రావు, టిడిపి నాయకులు ఆర్.జగ్గారావు, మండల అధ్యక్షులు టి.బాలయ్య, ఎ.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో సిసి రోడ్డు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన వెల్దుర్తిలో రూ.50 లక్షలతో సిసి రోడ్లకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఎంపిడిఒ ప్రసాద్, ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో రేఖజ్యోతి, అంగన్వాడి సూపర్వైజర్ దుర్గా, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ బాబు నాయక్ పాల్గొన్నారు.

గేదె గొంతులో కిలోన్నర వ్యర్థాలు

నాలుగు గంటల పాటు విజయవంతంగా ఆపరేషన్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గొంతులో ప్లాస్టిక్‌తో ఇతర వ్యర్థాలు అడ్డుపడి కొన్ని రోజులుగా మేత నీరు తీసుకోకుండా నీరసపడి అపస్మారక స్థితిలో ఉన్న 10 నెలల చూడు గేదెకు శస్త్ర చికిత్స ద్వారా ప్రసవం చేశారు. దీంతోపాటు పశువు గొంతులో ఇరుక్కున్న ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలను తొలగించి పశువును, లేగ దూడకు రొంపిచర్ల మండలం కర్లకుంట గ్రామ పశు వైద్యులు డాక్టర్ ఆవుల సాయి మహేష్‌రెడ్డి, సంతగుడిపాడు గ్రామ పశు వైద్యులు డాక్టర్ వెంకట శ్రీకాంత్ ప్రాణం పోశారు. ప్రసవం అనంతరం 4 గంటల పాటు సస్త్ర చికిత్స చేసి పశువు గొంతులో ఇరుక్కున్న 1.5 కిలోల ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలను తొలగించారు. ప్రస్తుతం పశువు, లేగ దూడ ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని వారు చెప్పారు.

ఆపరేషన్ అనంతరం గేదె, దూడ... తొలగించిన వ్యర్థాలు

ప్రతి ఫిర్యాదూ త్వరితగతిన పరిష్కారం కావాలి : పల్నాడు జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కు వచ్చే ప్రతీ ఫిర్యాదు పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన 76 మంది అర్జీదారులు తమ వినతులను జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం అవుతాయానే నమ్మకంతో నలుమూల ప్రాంతాల నుంచి అర్జీదారులు ఇక్కడకి వస్తుంటారని అన్నారు. అటువంటి వారి సమస్యలను సావధానంగా విని, సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, ఆ పరిష్కారంతో అర్జీదారు సంతప్తి చెందాలని సూచించారు.ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ తదితరులు

అప్పులవాళ్ల వేధింపులు ఎక్కువయ్యాయి

ఆదుకోవాలని ఆత్మహత్య చేసుకున్న కౌలురైతు భార్య వినతి

పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తుండగా వ్యవసాయంలో వచ్చిన వరుస నష్టాలతో రూ 10 లక్షల మేర అప్పుల పాలై అప్పులు తీర్చే మార్గం లేక రెండు నెలల క్రితం తన భర్త తలపాల అర్జున్ పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని అతని భార్య అరుణ తెలిపారు. తమకు చిన్నపాటి ఇళ్ళు తప్ప ఒక్క సెంటు కూడా పొలం లేదని అప్పుల వాళ్ళ వేధింపులు ఎక్కువయ్యాయని, ఇద్దరు పిల్లల పోషణ చదువులు భారంగా మారిన నేపథ్యంలో ప్రభుత్వ పరంగా తనను ఆదుకోవాలని అమరావతి మండలం అత్తలూరు గ్రామానికి చెందిన మృతుడు భార్య తలపాల అరుణ జిల్లా కలెక్టర్ ను వేడుకున్నారు.

అన్న మోసంపై తమ్ముడు ఫిర్యాదు

వారసత్వంగా పెద్దల నుండి సంక్రమించిన 1.20 సెంట్ల భూమిలో పెద్ద కుమారుడని తన అన్నయ్యకు 80 సెంట్లు , తనకు 40 సెంట్లు రాశారని కారంపూడి మండలం మిర్యాల గ్రామానికి చెందిన బత్తుల వెంకటేశ్వర్లు తెలిపాడు. అయితే తన అన్న బత్తుల రాముడు రెవెన్యూ అధికారులు అండదండలతో మోస పూరితంగా ఎకరా భూమిని తన పేరిట వెబ్ ల్యాండ్‌లో నమోదు చేయించుకున్నాడని తెలిపాడు. అన్ని ఆధారాలతో రెవెన్యూ అధికారులు కలిసినప్పటికీ రెవెన్యూ అధికారులు తనకు న్యాయం చేయలేదని దీనిపై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని తన అన్న పై ఫిర్యాదు చేశాడు.

నా భూమిని హైవే రోడ్డు అధికారులు ఆక్రమించారు

కలకత్తా చెన్నై రహదారి కి అనుబంధంగా చిలకలూరిపేట మండలం తిమ్మాపురం గ్రామం వద్ద నుండి బొప్పూడి వరకు నిర్మించిన హైవే రోడ్డు మార్గంలో 1.19 సెంట్ల భూమిలో 20 సెంట్లు రోడ్డు మార్గం కింద అధికారులు తీసుకుని దానికి సంబంధించి పరిహారం అందించారని బొప్పూడి గ్రామానికి చెందిన నందిగం వీరయ్య తెలిపారు.అయితే రోడ్డు నిర్మాణం మాత్రం తమ భూమిలో 4 సెంట్లు అదనంగా కలిపేసుకున్నారని దీనికి సంబంధించి పరిహారం కోసం అధికారులు, సిబ్బంది చుట్టూ తిరిగినా పట్టించుకోవడంలేదని న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు.

పింఛను మంజూరు చేయాలని వినతి

ఆరేళ్ల క్రితం భార్య మృతి చెందగా ఒంటరిగా గడుపుతున్నారని ముగ్గురు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నప్పటికీ తనను పట్టించుకోకపోవడంతో తోపుడు బండిపై కాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నానని మాచర్ల కు చెందిన వద్ధుడు షేక్ బుడే సాహెబ్ జిల్లా కలెక్టర్ ను వేడుకున్నారు. తనకు అన్ని అర్హతలు ఉన్న పింఛను మంజూరు చేయడంలో సచివాలయ సిబ్బంది అధికారులు జాప్యం చేస్తున్నారని దీనిపై విచారణకు పెన్షన్ మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు.

తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని వినతి

వేధింపుల నేపథ్యంలో ఉద్యోగం నుండి తొలగించిన మమ్మల్ని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గత 13 రోజులుగా నిరసన చేస్తున్న ప్రజాప్రతినిధులు మున్సిపల్ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని తమకు న్యాయం చేయాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం ఉద్యోగులు పారిశుధ్య కార్మికులు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టి అనంతరం స్పందనలో జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ ఆవేదన వెలి బుచ్చారు. తమవి చిరు కుటుంబాలని తమ కుటుంబాలు తమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని విధుల నుండి తొలగించడం పెండింగ్లో వేతనాలు ఉంచడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని అప్పులు తీసుకువచ్చి కుటుంబాన్ని పోషించుకుంటున్నామని తిరిగి తమను విధుల్లోకి తీసుకోకపోతే ఆత్మహత్యే శరణ్యమని జిల్లా కలెక్టర్ వద్ద వాపోయారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అనేక సందర్భాలలో రాజకీయ వేధింపులు తమ హయాంలో ఉండవని ఒకవైపు ప్రకటిస్తూనే ఉన్నారని మరోవైపు దొడ్డిదారిన కాంటాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో ఉద్యోగులను కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోకపోతే మంగళవారం నుండి రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోతే జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం ఉద్యోగులను కార్మికులను సిఐటియు ఆధ్వర్యంలో ఏకం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం నిరసన శిబిరానికి చేరుకొని నిరసన కొనసాగించారు.

మహిళపై యువకుడి దాడి

కూతురి ఆచూకి చెప్పలేదని తల్లికి కత్తిపోట్లు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

యువకుడు మహిళ పై కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయ పరిచిన సంఘటన సత్తెనపల్లి పట్టణంలోని రంగా కాలనీలో సోమవారం జరిగింది. ఈ ఘటనలో రంగాకాలనీకి చెందిన నూతల కరుణ (55) తీవ్రంగా గాయపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సత్తెనపల్లి వడ్డవల్లి ప్రాంతానికి చెందిన కాశింశెట్టి పూర్ణచంద్రరావు అలియాస్ పూర్ణ బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. గతంలో భవన నిర్మాణ కార్మికునిగా పనిచేసిన సమయంలో కరుణ కుమార్తెతో పరిచయం ఏర్పడింది. భర్త తో విడాకులు తీసుకుని తల్లి దగ్గర ఉంటున్న యువతితో యువకుడు సహజీవనం చేస్తున్నాడు. యువతిని మానసిక హింసిస్తుడంతో భరించలేక వేరే ప్రాంతానికి వెళ్ళింది. కుమార్తె ఆచూకి చెప్పాలని ఆమె తల్లితో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో ఆగ్రహించిన యువకుడు కత్తితో ఆమెపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. స్థానికులు బాధితురాలిని సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. యువకుడు కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జిజిహెచ్‌లో నర్సుల నిరసన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాఫ్ నర్స్ పై ఎక్స్ రే టెక్నీషియన్ ఒకరు దురుసుగా మాట్లాడటాన్ని నిరసిస్తూ స్టాఫ్ నర్సులు సోమవారం సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. టెక్నిషియన్ శివారెడ్డిపై చర్యలు కోరుతూ స్టాఫ్ నర్స్ ల రాత పూర్వక ఫిర్యాదు చేశారు. చట్ట పరం గా చర్యల తో పాటు శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శాఖ పరమైన విచారణకు ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదేశాలు జారీ చేశారు . స్టాఫ్ నర్స్ పై అనుచితంగా మాట్లాడిన టెక్నీషియన్ పై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు పంపుతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ అంశంపై ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి డ్యూటీలో ఉన్న టెక్నిషియన్ శివారెడ్డి అనుచిత ప్రవర్తనపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని డిప్యూటీ సూపరింటెండెంట్‌లు ఉమా జ్యోతి, గోవిందనాయక్, ఆర్ఎంవో సతీష్, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు గంగమ్మ, కిరణ్మయి, విజయకుమారిలతో కమిటీని నియమించారు.

వేలం ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, తెనాలి
ఇ.పి. నెంబరు 29/2024 ఇన్
ఓ.యస్.నెం. 571/2022

బిట్వీన్ :
అద్దంకి పిచ్చిరాజు .... డిక్రీ హోల్డర్
మరియు
షేక్ కాలేషవలి అలియాస్ కాలేష...జడ్జిమెంట్ డెటార్

పై నంబరు ఇ.పి.లో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం జె.డి.ఆర్. స్వాధీనములో గల ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తి పైకోర్టు వారిచే ది.29-10-20024వ తేదీన ఉదయం గం.10.30 ని॥ లకు లగాయతు వేలం వేయబడును. కావలసినవారు శ్రీ కోర్టు వారు ఎదుట హాజరై వేలం పాటలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు

గుంటూరు జిల్లా, తెనాలి రి॥డి॥ అంగలకుదురు గ్రామ పంచాయితీ, అంగలకుదురు గ్రామ డి.నెం. 230/1-య.06.66 సెంట్లు, ప్రక్క డోర్ నెం. 1-98కు హద్దులు:-
తూర్పు :- షేక్ సాంబయ్య గారి ఆస్తి 46 లింకులు
దక్షిణం:- షేక్ మస్తాన్ బి గారి ఆస్తి 37 లింకులు
పడమర:-9 అ॥లు వెడల్పు గల జాయింట్ నడవదారి 47 3/4 లింకులు
ఉత్తరం:- షేక్ హుస్సేన్ గారి ఆస్తి - 37 లింకులు
యీ నాలుగు హద్దుల మధ్య గల 84 చ॥ గ॥ ల ఖాళీ స్థలము.
పైన ఉదహరించిన హద్దులలో షుమారు 84 చ॥ గ॥ల స్థలము మరియు ప్రస్తుతము సదరు స్థలములో నిర్మించబడిన 1వ అంతస్తు గల స్థిరాస్తి.
డి.హెచ్.ఆర్. విలువ - రూ.15,00,000/-
అమీనా విలువ - రూ.25,00,000/-
వేలం తేది - 29-10-2024
ఫర్దర్ హియరింగ్ - 14-11-2024
నోట్ : ఇ.సి. దాఖలా ప్రకారము కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్, తెనాలి వారికి తనఖా కలిగి యున్నది. ఈ తనఖాకు లోబడి వేలం జరుపబడును.

C.V. SUBBA RAO
C. RADHA KRISHNA
ADVOCATES
డి.హెచ్.ఆర్. తరుపు న్యాయవాదులు
 # 1-29-12, L.N. Swamy Streel
Nazerpet, TENALI
Andhra Pradesh
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది

నా క్లైంటు అయిన గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ కాపురస్తుడు షేక్ సత్తార్ గారి కుమారుడు షేక్ దావూద్ గారి చేత సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది. ఏమనగా... నా క్లైంటుకు చెందిన ఒరిజినల్ పాస్‌పోర్టు ఇంటి దగ్గర నుండి తీసుకొని జిరాక్స్ నిమిత్తము వడ్లమూడి అడ్డరోడ్డుకు వచ్చు సమయంలో 10 /10/ 2024 న ఉదయం 11 గంటల సమయంలో పాస్‌పోర్టు జారి పోయినది. అక్కడ వెతికినప్పటికీ, చుట్టుప్రక్కల వారిని విచారించినప్పటికీ, ఇప్పటివరకు పాస్‌పోర్టు దొరకలేదు. సదరు పాస్‌పోర్టు నంబరు: **K 0651271** గా ఉన్నది. సదరు పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది ఫోన్ నంబర్లకు తెలియపరచగలరు.

ఇట్లు
తాడిబోయిన శ్రీనివాసరావు

ఒరిజినల్ బిఎస్సీ మార్కుల జాబితా పోయినది

పల్నాడు జిల్లా, సత్తెనపల్లి మండలం, ధూళిపాళ్ల గ్రామానికి చెందిన బద్దుల రవితేజ తండ్రి నరేంద్రకు చెందిన ఒరిజినల్ మార్కుల జాబితా పోయినది. ఈ బిఎస్సీ మార్కుల జాబితా గోవా యూనివర్సిటీకి చెందిన డాన్ బాస్కో వ్యవసాయ కళాశాల, సుల్కోర్నా - గోవా వారు జారీ చేశారు. సత్తెనపల్లి నుండి ధూళిపాళ్ల వెళ్ళే మార్గమధ్యంలో పోయినది. దొరికిన వారు దయచేసి ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు. స్వయంగా తెచ్చి ఇస్తే తగిన పారితోషికం ఇవ్వబడును.

ఇట్లు
బద్దుల రవితేజ, తండ్రి నరేంద్ర

ప్రకటన
మహారాజశ్రీ విజయవాడ 4వ అదనపు జిల్లా జడ్జి మరియు ప్రిన్సిపల్ ఫ్యామిలి వారి కోర్టులో
FCOP (MC) No: 70 of 2024

Between:
రుద్రరాజు (చేకూరి) శ్రీ నాగ దివ్య .... పిటీషనర్
మరియు
రుద్రరాజు రవి వర్మ ... రెస్పాండెంట్
టు,
రెస్పాండెంటు : రుద్రరాజు రవివర్మ, S/o. చంద్రరాజు, హిందూ, డోరు నెం: 4-21/B, వయస్సు 45 సం॥లు, ప్రైవేట్ ఉద్యోగి, శ్రీ సీతా కోదండ రామాలయం దగ్గర నివాసం, ఖాజీపాలెం, పిట్టలవానిపాలెం మండలం, గుంటూరు జిల్లా-522 329,

పై నెంబరు పిటిషన్లో కోర్టు వారు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను ముట్టనందున మరియు మీరు నోటీసులను ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున మీ నోటీసు నిమిత్తము కోర్టు వారు తేది. 21-10-2024న వాయిదా వేసినారు. తేది. 21-10-2024న ఉదయం గం. 10.30ని.లకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గాని హాజరుపడి మీ ఆక్షేపణలు తెలియచేయగలరు. లేని యెడల మీ పరోక్షమున కేసు తీర్మానము చేయబడునని తెలియచేయడమైనది.
వాయిదా తేది. 21-10-2024
(కోర్టువారి అనుమతితో)

జె.వి.రమణ,
పిటీషనర్ తరపు న్యాయవాది,
డోర్ నెం. 20-6-87,
3వ లైన్, రామలింగేశ్వరపేట,
విజయవాడ- 520003
సెల్ నెం. 9849241918

స్థలం: విజయవాడ,
తేది: 25.09.2024

ప్రకటన
మహారాజశ్రీ విజయవాడ 4వ అదనపు జిల్లా జడ్జి మరియు ప్రిన్సిపల్ ఫ్యామిలి వారి కోర్టులో
FCOP No: 72 of 2024

Between
రుద్రరాజు (చేకూరి) శ్రీ నాగ దివ్య .... పిటీషనర్
మరియు
రుద్రరాజు రవివర్మ ..... రెస్పాండెంట్
టు :
రెస్పాండెంటు : రుద్రరాజు రవివర్మ, S/o చంద్రరాజు, హిందూ, డోరు నెం: 4-21/B, వయస్సు 45 సం॥లు ప్రైవేట్ ఉద్యోగి, శ్రీ సీతా కోదండ రామాలయం దగ్గర నివాసం, ఖాజీపాలెం, పిట్టలవానిపాలెం మండలం, గుంటూరు జిల్లా-522329,

పై నెంబరు పిటిషన్లో కోర్టు వారు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను ముట్టనందున మరియు మీరు నోటీసులను ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున మీకు నోటీసు నిమిత్తము కోర్టు వారు తేది. 21-10-2024న వాయిదా వేసినారు. తేది. 21-10-2024న ఉదయం గం. 10.30ని.లకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గాని హాజరుపడి మీ ఆక్షేపణలు తెలియచేయగలరు. లేని యెడల మీ పరోక్షమున కేసు తీర్మానము చేయబడునని తెలియచేయడమైనది.
వాయిదా తేది. 21-10-2024.
(కోర్టువారి అనుమతితో)

జె.వి.రమణ,
పిటీషనర్ తరపు న్యాయవాది,
డోర్ నెం. 20-6-87,
3వ లైన్, రామలింగేశ్వరపేట,
విజయవాడ- 520003
సెల్ నెం. 9849241918

స్థలం: విజయవాడ,
తేది: 25.09.2024

DOCUMENT MISSING

పల్నాడు జిల్లా, నరసరావుపేట పట్టణం,రామిరెడ్డిపేట R/D.No 11-19-87 నివాసి మొగల్ షాకిరున్నిసా బేగం W/o మొగల్ గఫార్ బేగ్ అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా నరసరావు పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పొందిన నరసరావుపేట పట్టణం ప్రకాష్ నగర్ సర్వే నెం.310 లోని 778 చ.గ.లు స్థలానికి చెందిన గిఫ్ట్ డీడ్ డాక్యుమెంట్ నెం.897/2002, ఎస్.ఆర్.కె.టి కాలనీ గాసి నగర్ సేల్ డీడ్ ద్వారా పొందిన డి.నెం 222/ఎ లోని 180.12 చ.గ.లు డాక్యుమెంట్ నెం.6834/2008, గుంటూరు-కర్నూలు జాతీయ రహదారికి ఎడమ వైపు సేల్ డీడ్ సర్వే నెం.380/2ఎ లోని 163.44 చ.గ.లు డాక్యుమెంట్ నెం.480/2004 గల 3 స్థలాలకు చెందిన ఒరిజినల్ దస్తవేజులు ది.09-10-2024 న నిమిత్తం రామిరెడ్డిపేట లోని ఇంటి వద్ద నుండి అరండల్ పేట బ్యాంక్ స్ట్రీట్ వైపు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మార్గం మధ్యలో ఎక్కడో పడిపోయినవి. ఎంత వెదికినను దొరకలేదు. డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికిన యెడల పై అడ్రస్ లో లేదా 94904 68789 నెం.లో సంప్రదించగలరు. సదరు డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికి వాటిని దుర్వినియోగం పరిస్తే చట్ట పరంగా నేను తీసుకునే చర్యలకు బాధ్యులగుదురు.

తిరుగు ప్రయాణంలో కిక్కిరిసి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

దసరా సెలవులు ముగియటంతో ప్రజలు సొంత ఊళ్లకు పయనమయ్యారు. ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలలకు 10 రోజులు దసరా సెలవులు ప్రకటించటంతో పిల్లాపాపలతో బంధువుల ఇళ్లకు వచ్చారు. సెలవులు అనంతరం సొంత ఊళ్ళకు వెళ్లేవారికి ఆర్టీసీ తగిన విధంగా బస్సులు ఏర్పాటు చేయకపోవటంతో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. బస్సులు, రైళ్ల ప్రయాణికులతో కిటకిటలాడాయి.

మహాసభలో గుంటూరు విజయ్‌కుమార్, ఇతర నాయకులు

కాల్వల మరమ్మతులు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

సిపిఎం మాదల రెండో శాఖ మహాసభ ఎం.వెంకటరెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. గ్రామంలోని లైబ్రరీ సెంటర్ వద్ద నుంచి మాదల నుండి సత్తైనపల్లి వెళ్లే రోడ్డులో ఉన్న సిమెంట్ రోడ్డు వరకు సైడు కాలవలు నిర్మించాలని, అక్కడ నుండి సత్తైనపల్లి వరకూ ఉన్న డొంక రోడ్డుకు సైడు కాల్వలు పూడిక తీసి మరమ్మతు చేయాలని, ఊరి వెంబడి ఉన్న చెరువులలో పూడికతీసి ఆ మట్టితో రోడ్డు పక్కనే ఉన్న చెరువు కట్టలు పటిష్టంగా వేయాలని మహాసభ డిమాండ్ చేసింది. ఊరి వెంబడి ఉన్న చెరువు నుంచి వచ్చే నీరు ద్వారా సుమారు 100 ఎకరాలు రైతులు పంటలు సాగుచేస్తున్నారని, ఆ పొలాకు నీరు వెళ్లేందుకు చెరువు గుండా ఉన్న తూములు పూర్తిగా పూడిపోయాయని, వాటిని మరమ్మతులు చేయాలనీ మహాసభ కోరింది. ఈ మేరకు తీర్మానాన్ని ఆమోదించింది. అనంతరం కార్యదర్శిగా దారా చిన్నారావును ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, మండల కార్యదర్శి జి.బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సమస్యలపై ఎమ్మెల్యేకు వివరిస్తున్న డి.శేషారావు

ప్రజాదర్బార్‌లో పింఛన్లు, రెవెన్యూ సమస్యలపై అధికంగా ఫిర్యాదులు

ప్రజాశక్తి - పెదకూరపాడు

రెవెన్యూ సమస్యల పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. రెవెన్యూ విభాగానికి 63 దరఖాస్తులు, పింఛన్ల కోసం 66, ఇంజినీరింగ్ శాఖకు 23, ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి 12, ఆర్ అండ్ బి విభాగానికి 4, విద్యుత్ శాఖకు 14 దరఖాస్తులు వచ్చాయి. పెదకూరపాడులోని కమ్యూనిటీ ఆసుపత్రిలో ఎనస్తీషియా, గైనకాలజిస్ట్, జనరల్ సర్జన్ డాక్టర్లను వెంటనే నియమించాలని పెదకూరపాడు అభివృద్ధి వేదిక వితనిపత్రం ఇచ్చింది. వేదిక కన్వీనర్ డి.శేషారావు మాట్లాడుతూ ఆస్పత్రిలో ఏడాదిగా గైనకాలజిస్ట్ లేరని, 7 నెలల నుంచి జనరల్ సర్జన్ డాక్టర్ లేకపోగా నాలుగు నెలల నుంచి ఎనస్తీషియా డాక్టర్ పోస్ట్ ఖాళీగా ఉందని వివరించారు. ఈ పరిస్థితి వల్ల ఈ పరిసర గ్రామ ప్రజలు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. తాళ్లూరు, అత్తలూరు, మందపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి రోగులను సర్జరీ కోసం ఇక్కడికి వచ్చేవారని, ఇక్కడ వైద్యులు లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. కొత్త ఆసుపత్రి భవనంలో వసతులు ఏర్పాటు చేసి వినియోగములోనికి తేవాలని కోరారు. నియోజవర్గ పరిధిలోని ఇసుక రీచ్‌లను వెంటనే ప్రారంభించాలని సిపిఐ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు వినతపత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఇసుక రీచ్‌లను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, ఎం.మస్తాన్‌రావు, జానీబాషా, ఆర్.ముత్తయ్య, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

మంజులవాణికి నివాళులర్పిస్తున్న గుంటూరు విజయ్‌కుమార్, గద్దె చలమయ్య తదితరులు.. ఇన్‌సెట్‌లో మంజులవాణి (ఫైల్)

సిపిఎం నాయకులు పొట్టి సూర్యప్రకాశరావుకు సతీవియోగం

ప్రజాశక్తి - సత్తెనపల్లి

పట్టణానికి చెందిన సిపిఎం నాయకులు, మాదల మాజీ సర్పంచ్, పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పొట్టి సూర్యప్రకాశరావు భార్య మంజుల వాణి(67) సోమవారం మరణించారు. తెల్లవారుజామున బాత్రూమ్‌కు వెళుతుండగా ఒకసారిగా కుప్పకూలి పడిపోయి అపస్మాకర స్థితిలోకి వెళ్లారు. వెంటనే ఆమెను కుటుంబ సభ్యులు గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె సాయంత్రానికి మృతి చెందారు. భౌతికకాకాన్ని సత్తెనపల్లిలోని ఆమె నివాసం వద్ద సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్, రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వర్‌రెడ్డి, ఎస్.ఆంజనేయులు నాయక్, జి.రవిబాబు, పట్టణ కార్యదర్శి డి.విమల, మండల కార్యదర్శి పి.మహేష్, నాయకులు ముప్పాళ్ల మండల కార్యదర్శి జి.బాలకృష్ణ, ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య సందర్శించి నివాళులర్పించారు. మంజుల వాణికి కుమారుడు మురళి, కుమార్తె కుసుమ ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం నాయకులు జి.మల్లేశ్వరి, ఎం.జ్యోతి, కె.నాగేశ్వరరావు, ఎం.వెంకటరెడ్డి, కె.శివరాజ్ కుమార్, ఎం.వెంకటనారాయణ, జి.ఉమశ్రీ, కె.శివదుర్గారావు, ఐ.లింగయ్య, జి.జాలయ్య, పి.వీరేశం ఉన్నారు. అంత్యక్రియలు బుధవారం నిర్వహిస్తామని కుటుంబీకులు తెలిపారు.

ఐసిఐసిఐలో అక్రమాల బాధిత డిపాజిటర్లకు న్యాయం చేయాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఐసిఐసిఐ బ్యాంకులో అక్రమాలకు ఆ బ్యాంకే బాధ్యత వహించి డిపాజిటర్లకు సత్వర న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. చిలకలూరిపేట, నరసరావుపేట, విజయవాడ బ్రాంచ్‌లలో అక్రమాలు జరగ్గా మేనేజర్‌గా పనిచేసిన ఒకే వ్యక్తి ప్రధాన నిందితుడుగా ఉన్నాడని, ఒక్కో ఉద్యోగి రెండు మూడేళ్లకు మించి ఒకచోట పని చేయడని, అలాంటిది ఐదేళ్లుగా అక్రమాలు జరుగుతుంటే యాజమాన్యం ఏం చేస్తోందని ప్రశ్నించారు. బాధిత డిపాజిటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారికి తగిన హామీ ఇవ్వాలని కోరారు. సాంకేతిక పరమైన డిపాజిటర్ల ప్రశ్నలకు ఆడిటర్లు సమాధానం చెప్పాలన్నారు. ఈ కుంభకోణంలో పాత్ర ఉన్న అందరికీ కఠిన శిక్షలు వేయాలని కోరారు.

గ్రీవెన్స్‌కు ఏడు ఫిర్యాదులు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏడు ఫిర్యాదులు అందాయి. అధిక శాతం స్థల వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు అందాయి. తహశీల్దార్ జియాఉల్‌హక్ మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి : ఎస్పీ

ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుండి అర్జీలను ఎస్పీ కె.శ్రీనివాసరావు స్వీకరించారు. కుటుంబ, ఆస్తి, ఆర్థిక సమస్యలపై 43 ఫిర్యాదులు వచ్చాయి. వీటికి తొలి ప్రాధాన్యమిచ్చి, త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని, పోలీసులను ఎస్పీ ఆదేశించారు.

చిట్టీల నిర్వాహకుని మోసం

కారంపూడి మండలం చింతపల్లికి చెందిన మాగంటి వీరసైదులు నరసరావుపేట ఈశ్వర్ చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో రూ.30 లక్షల చిట్టికి 40 నెలలకు గాను ప్రతినెలా రూ.75 వేలు చొప్పున 20 నెలల పాటు రూ.15 లక్షలు చెల్లించిన అనంతరం ఆర్థిక పరిస్థితి బాగా లేని కారణంగా మిగిలిన 20 నెలలకు గాను డబ్బు చెల్లించలేకపోయాడు. గడువు ముగిసి రెండేళ్లయినా కమీషన్ తీసుకొని రావాల్సిన డబ్బులు ఇవ్వాలని ఎన్నిసార్లు అడిగినా ఇవ్వడం లేదని నిర్వాహకులపై ఫిర్యాదు చేశారు.

స్థలాన్ని ఆక్రమించారు

తన కుటుంబానికి చెందిన కొంత స్థలాన్ని ఆక్రమించిన అన్నలదాసు తులసమ్మ, అన్నలదాసు మోషే వారి అనుచరులు కొచ్చర్ల రాణి, కొచ్చర్ల కోటయ్యలపై చర్యలు తీసుకోవాలని చిలకలూరిపేట పట్టణం సంజీవనగర్‌కు చెందిన ఒంటరి మహిళ మేళం రాజకుమారి ఫిర్యాదు చేశారు. ఇంటి స్థలంలోనికి అక్రమంగా ప్రవేశించడాన్ని ప్రశ్నించగా దాడి చేసి దుర్భాషలాడారని చెప్పారు.

ఎమ్మెల్యే పిఎ, మంత్రి ఓఎస్‌డిలపై ఫిర్యాదు

ఉద్యోగం ప్రయత్నాల్లో ఉండగా పరిచయస్తుడైన విశాఖ జిల్లా ఎస్.కోట ఎమ్మెల్యే కడిబంది శ్రీనివాసరావు పీఏ అమరసర్వ దేవుళ్ల అలియాస్ సర్వ ద్వారా పరిచయమైన హరీష్, శ్రీనివాసరావు మంత్రి దగ్గర ఓఎస్‌డీగా పని చేస్తున్న ముగ్గురు కలిసి ఉద్యోగం ఇప్పిస్తామని రూ.10 లక్షలు తీసుకుని మొహం చాటేశారని నరసరావుపేట మండలం రంగారెడ్డిపాలేనికి చెందిన దండే శివకుమార్ ఫిర్యాదు చేశారు.

కొడుకులే కొట్టబోయారు

ముగ్గురు కుమారులు కాగా ఆస్తిని సమంగా పంచి కొంత భూమిని తన పేరిట ఉంచుకున్నానని, పెద్ద కుమారుడు పూజల శ్రీనివాసరావు ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో తన పేరిట కొంత పొలం రాద్దామని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి సాక్షి సంతకం కోసం చిన్న కుమారులు రంగారావు, రంగనాథంను పిలువగా వారు అక్రమంగా తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని నరసరావుపేట మండలం అల్లూరివారిపాలేనికి చెందిన పూజల మంగమ్మ ఫిర్యాదు చేశారు. ఇటీవల పొలం విక్రయించేందుకు చూడగా చిన్న కుమారులు చేసిన మోసం వెలుగులోకి వచ్చిందని, ఇదేమని ప్రశ్నిస్తే దాడి చేయబోయారని వాపోయారు.

ఆస్తిలో వాటా పంచకుండా దౌర్జన్యం

తల్లి పేరిట ఉన్న అస్తిని సోదరులు తనకు వాటా పంచకుండా దౌర్జన్యం చేస్తున్నారని, గత వాటాలలో వచ్చిన ఇంటిని సైతం కూల్చి ఇబ్బందులు పెడుతున్నారని ఈపూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని ఈపూరు మండలం కొత్తనెల్లూరుకు చెందిన పోకా సాంబశివరావు ఫిర్యాదు చేశారు.

పొలాన్ని ఆక్రమించి దాడి

అచ్చంపేట మండలం వేల్పూరు గ్రామ రెవెన్యూ పరిధిలో తన కుటుంబానికి వారసత్వంగా లభించిన రెండెకరాల పొలంలో 16 సెంట్లను ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్నారని అచ్చంపేట మండలం గ్రంధసిరి గ్రామానికి చెందిన పరుచూరి లింగారావు మల్లేశ్వరి దంపతులు ఫిర్యాదు చేశారు. ఆక్రమణపై ప్రశ్నించినందుకు కుంచా నాగేశ్వరరావు, కిలారి మణి, రావెళ్ల నారయ్య దాడి చేశారని చెప్పారు. దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

గుంటూరులో 90 రోజుల శానిటేషన్ డ్రైవ్

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్యం అందించడానికి 90 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపడుతున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. డ్రైవ్ పర్యవేక్షణకు శానిటరీ డివిజన్ల వారీగా పర్యవేక్షణ కోసం సీనియర్ అధికారులను నియమించామన్నారు. సోమవారం జిఎంసి కౌన్సిల్ హాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌పై విభాగాధిపతులు, డిప్యూటీ కమిషనర్లు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరును స్వచ్ఛ నగరంగా మార్చుకోవడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఇందులో భాగంగా నగరంలోని 22 శానిటరీ డివిజన్లకు సీనియర్ అధికారులను పారిశుధ్య పర్యవేక్షణకు విధులు కేటాయించామని తెలిపారు. విధులు కేటాయించబడిన అధికారులు ప్రతి రోజు ఉదయం 5:30 గంటలకు ప్రజారోగ్య కార్మికుల హాజరు మస్టర్ పరిశీలించాలన్నారు. రాబోయే మూడు నెలల కాలంలో పారిశుధ్యంలో విప్లవాత్మక మార్పులకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యుజిడి లీకులు లేకుండా చర్యలు తీసుకోవాలి...

గుంటూరు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి వ్యవస్థ ఉన్న ప్రాంతాల్లో ఓవర్ ఫ్లో వలన ప్రజలకు ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ ఆనందపేట, గోరంట్ల ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజి లైన్లు, పారిశుధ్య పనులను పరిశీలించి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆనందపేటలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజి ఓవర్‌ఫ్లో వలన మురుగు నిలిచిన ప్రాంతాలను పరిశీలించి, తక్షణం నీటిని బెయిల్ అవుట్ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేకంగా సక్కర్ వాహనాలను, యుజిడి లైన్లు శుభ్రం చేసే వాహనాలను తెప్పించి సంబందిత ప్రాంతాల్లో యుజిడి లైన్లను వెంటనే క్లియర్ చేయాలన్నారు. యుజిడి లీకులు ఏర్పడకుండా శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యటనలో డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కష్ణయ్య, ఈఈలు కోటేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని డోలాస్ నగర్ 132 కెవి లైన్ కండక్టర్ మార్చుతున్న సందర్భంగా మంగళవారం ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డి ఈ. సురేష్ బాబు. నులకపేట ఏఈ షణ్ముఖరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల డోలాస్ నగర్. ప్రకాష్ నగర్ ప్రాంతాల్లో కలుగు విద్యుత్ అసౌకర్యానికి ప్రజలు సహకరించవలసిందిగా కోరారు.

వరద బాధితులకు రూ.8 లక్షల విరాళం

ప్రజాశక్తి - తుళ్లూరు

వరద బాధితుల సహాయార్థం రాజధాని రైతులు,మహిళలు రూ 8 లక్షల చెక్కు ను సిఎం చంద్రబాబుకు సోమవారం అంద జేశారు. చెక్కు అందజేసిన వారిలో అమరావతి రైతు జెఎసి నాయ కులు కాటా అప్పారావు, కొమ్మినేని సురేష్ తదితరులు ఉన్నారు.

చేబ్రోలు యుటిఎఫ్ కార్యాలయంలో పట్టభద్రుల ఓటు నమోదు కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - చేబ్రోలు

చేబ్రోలులోని యుటిఎఫ్ కార్యాలయం ఉపాధ్యాయ భవన్‌లో ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు సహాయ కేంద్రాన్ని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి లేదా మార్చి నెలలో జరగనున్న కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలలో డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని యుటిఎఫ్ మండల కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె విజయ రాజు , పి పార్థసారథి కోరారు. అక్టోబర్ 31, 2021 లోపు డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని అన్నారు. అర్హత కలిగిన అందరూ నవంబర్ 6 లోపు ఆన్లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా ఓటర్ గా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఆధార్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రము, డిగ్రీ సర్టిఫికెట్, ఫామ్ 18తో కలిపి సంబంధిత తహసిల్దార్ కార్యాలయం లో ఇచ్చి ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత బలీయమైనదని

చైతన్యవంతులైన పట్టభద్రులు ప్రజాపక్షం వహించే ప్రజా మేధావులను ఓటు వేసి చట్టసభలకు పంపడం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కౌన్సిలర్లు వై రమేష్ బాబు, డి నాగేశ్వరరావు, ఎల్ ఎన్ సహదేవుడు పాల్గొన్నారు.

మెన్ మల్టీ డే క్రికెట్ మ్యాచ్‌కు సాయి రాహుల్ ఎంపిక

మంగళగిరి నియోజకవర్గ పరిధిలో తొలి క్రికెటర్‌గా నమోదు

ప్రజాశక్తి - మంగళగిరి

సాయి రాహుల్

ఈనెల 17వ తేదీ నుండి బెంగళూరులో జరిగే అండర్ 25 మెన్ మల్టీ డే క్రికెట్ మ్యాచ్‌కు మంగళగిరి చెందిన కడియం పవన్ సాయి రాహుల్ ఎంపిక అయినట్లుగా అతని తండ్రి కడియం శ్రీనివాసరావు సోమవారం మీడియాకు తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఎస్ సతీష్ బాబు తమకు లెటర్ పంపినట్లుగా తెలిపారు. మంగళగిరి నియోజకవర్గం పరిధిలో మొట్టమొదటి క్రికెటర్ గా సాయి రాహుల్ సెలెక్ట్ అయినట్లుగా తెలిపారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన జిల్లా పవర్ లిఫ్టర్లతో కోచ్ సందాని

ఎపి టీంలో జిల్లా నుండి ముగ్గురు పవర్ లిఫ్టర్లు ఎంపిక

ప్రజాశక్తి - మంగళగిరి

ఈనెల 14 తేదీ నుండి 18వ తేదీ వరకు గోవాలో జరిగే నేషనల్ సబ్ -జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ మెన్ అండ్ ఉమెన్ బెంచ్ ప్రెస్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ బెంచ్ ప్రెస్ టీమ్‌లో గుంటూరు జిల్లాకు చెందిన ముగ్గురు పవర్ లిఫ్టర్లు ఎంపికయ్యారని గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెన్ జూనియర్ బెంచ్ ప్రెస్ కు రమేష్ శర్మ, జూనియర్‌ఉమెన్ బెంచ్ ప్రెస్ కాంత కుమారి, జ్యోతి వర్మ మాస్టర్స్ 1, మాస్టర్స్ 2 ఎంపికైనట్లుగా తెలిపారు. వీరు ముగ్గురు గుంటూరు పట్టణానికి చెందిన పవర్ లిఫ్టర్లు, ప్రతి రోజు గుంటూరు నుంచి మంగళగిరి వచ్చి ఫిట్ జోన్ కోచ్ సందాని వద్ద శిక్షణ పొందుతున్నారు.

‘ స్వర్ణాంధ్ర -2047 ’ విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-గుంటూరు

స్వర్ణాంధ్ర-2047 దార్శనిక ప్రణాళికలో భాగంగా పాఠశాల విద్యాశాఖ జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వం, చర్చ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూశాఖ అధికారి పెద్ది రోజా, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, డిఇఒ పి.శైలజ, సమగ్ర శిక్ష అడిషనల్ కో-ఆర్డినేటర్ విజయలక్ష్మి, ఆర్‌డిఒ శ్రీనివాసరావు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో డిఆర్‌ఒ, తదితరులు

కెఎల్‌యు విద్యార్థిని దివ్యకు కాంస్య పతకాలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో బిసిఎ చదువుతున్న జ్ఞాన దివ్య ఈ నెల 4 నుండి 13 వరకు దక్షిణాఫ్రికా లో జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో ఇండియా తరుపున అత్యంత ప్రతిభ కనబరిచి నాలుగు కాంస్య పతకాలను సాధించినట్లు వర్శిటీ ప్రొఫెసర్, వైస్ చాన్సులర్ డాక్టర్ ఎవిఎస్. ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్క్వాట్ 160 కేజీల బరువు లో ఒక కాంస్య పతకం, బెంచ్ ప్రెస్ 55కేజీలలో మరో కాంస్య పతకం, డెడ్ లిఫ్ట్ 157.5 కిలోల బరువు లో మరో కాంస్య పతకంతో పాటు ఓవరాల్ లో మరో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. మొత్తం నాలుగు కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొ న్నారు. తమ వర్శిటీలో క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సాహ మిస్తున్నట్లు, వారికి వంద శాతం ఫీజు రాయితీ ఇస్తున్నా మని తెలిపారు. ఈ సందర్భంగా వర్శిటీ వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్థసారధివర్మ, వైస్ చాన్సులర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖర రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్‌ఎస్.ప్రసాద్, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోం జ్ఞాన దివ్య ను అభినందించారు.

జ్ఞాన దివ్య ను అభినందిస్తున్న విసి డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్ తదితరులు

ఉండవల్లి విద్యార్థిని సహస్రకు ద్వితీయ బహుమతి

ప్రజాశక్తి-తాడేపల్లి

ఇటీవల స్వర్ణాంధ్ర 20 47 దార్శనిక ప్రణాళికలో భాగంగా గుంటూరు ఎస్సార్ శంకరం కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన పోటీల్లో ఉండవల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బిఎస్ సహస్ర అనే విద్యార్థి వక్తృత్వ విభాగంలో ద్వితీయ బహుమతి సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోకల ఆంజనేయులు తెలిపారు. జిల్లా ఏపీసి విజయలక్ష్మి. జిల్లా విద్యాశాఖ అధికారి పి శైలజ చేతులమీదుగా విద్యార్థినికి బహుమతి అందజేసినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. పోటీలకు విద్యార్థులకు తరపున భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు షేక్ షాహిద్ అలీ నీ డిఇఒ. శైలజ. డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారి జి శాంతకుమారి, ఎంఈఓ డి నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి ఆంజనేయులు, మరియు పాఠశాల విద్యా కమిటీ సభ్యులు సోమవారం విద్యార్థినికి అభినందనలు తెలిపారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



సహస్రను అభినందిస్తున్న పాఠశాల విద్యాకమిటీ సభ్యులు

మల్లేశ్వరస్వామిని దర్శించుకున్న ఇంటెలిజెన్స్ ఐజి రామకృష్ణ

ప్రజాశక్తి - తెనాలి

ఐజి కి ఫోటో ఫ్రేమ్ బహుకరిస్తున్న ఉప కమిషనర్

రాష్ట్ర ఇంటిలిజెన్స్ ఐ.జి. పి. హెచ్.డి. రామ కృష్ణ సోమవారం పెదకాకాని శ్రీ భ్రమరాంబ సమేత దుర్గా మల్లేశ్వర స్వామిని దర్శించు కున్నారు. ఆయన రాక సందర్భంగా ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ ఆలయ అర్చకస్వాములు, వేదపండితుల వేద మంత్రోఛ్చారణల నడుమ స్వాగతించారు. ఆలయ ప్రదక్షణ అనంతరము భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకము, కుంకుమ పూజలలో ఐ.జి. పాల్గొన్నారు. ఆలయ అర్చకస్వాములు, వేదపండితుల వేద ఆశ్వీర్వచనం అనంతరము ఆలయం తరపున ఐ.జి ని సత్కరించి, స్వామి చిత్రపటము బహూకరి ంచినట్లు ఉప కమిషనర్ తెలిపారు.

మహిళా న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ఝాన్సీ

చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

మహిళలకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటిపట్ల అవగాహన కలిగి చట్టాలను సక్రమంగా వినియోగించు కోవాలని మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు రిసోర్స్ పర్సన్ ఎస్‌బిఎ ఝాన్సీ అన్నారు. దుగ్గిరాలలోని ఎంపీడీవో కార్యాల యంలో సోమవారం జరిగిన మహిళా న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం మహిళ బాధితులకు సహాయం చేస్తుందని లీగల్ సెల్ ద్వారా నష్టపరిహారం పొందవచ్చునన్నారు. ఉచిత హెల్ప్ లైన్ నెంబర్ 15100 ఫోన్ చేసి ఉచిత న్యాయ సేవలు పొందవచ్చునని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దాదాపు 60 మంది మహిళలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రెహమాని మరియు కార్యాల సూపరింటెండెంట్ చంద్రమోహన్ పాల్గొన్నారు.

వినికిడి పరీక్షల శిబిరానికి 98 దరఖాస్తులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నేషనల్ ప్రోగ్రాం ఫర్ ప్రివేన్షన్ అండ్ కంట్రోల్ అఫ్ డెఫ్నెస్ కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డులోని పాత గవర్నమెంట్ హాస్పిటల్లో జిల్లా సత్వర చికిత్స కేంద్రం వద్ద సోమవారం నిర్వహించిన వినికిడి పరీక్షల శిబిరానికి 98 దరఖాస్తులు వచ్చినట్లు పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి తెలిపారు. దరఖాస్తుదారులకు త్వరిగతిన వినికిడి పరికరాలు అందిస్తామని పేర్కొన్నారు.

పొగాకు ప్రమాదాలపై ప్రజల్లో విద్యార్థులు అవగాహన పెంచాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలం వి.రెడ్డిపాలెం ఎపి మోడల్ స్కూల్లో సోమవారం 'టుబాకో ఫ్రీ స్కూల్' కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవినాయక్ మాట్లాడుతూ పొగాకు వాడకం ఎంతో హానికరమని, పొగాకు తాగినా, పీల్చినా, నమిలినా, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయని చెప్పారు. పొగాకు వలన కలిగే అనర్థాలపై పాఠశాల, ఇంటి పరిసర ప్రాంతాల్లో ప్రజలకు విద్యార్థులు అవగాహన కలిగించాలని సూచించారు. అనంతరం పొగాకుకు వ్యతిరేకంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు.

పట్టభద్ర ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల అవగాహన సదస్సు సత్తెనపల్లిలోని కాకతీయ కళ్యాణ మండపంలో సోమవారం. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. కన్నా లక్ష్మి నారాయణ మాట్లాడుతూ అర్హులంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, ఇందుకోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందన్నారు.

భారత ప్రభుత్వ నోటరీగా దాసరి చిట్టిబాబు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

భారత ప్రభుత్వ నోటరీగా దాసరి చిట్టిబాబు తిరిగి నియమితులయ్యారు. ఐదేళ్లుగా ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగుతున్నారు. తాజా నియామకంతో 2029 అక్టోబర్ వరకు ఆయన కొనసాగనున్నారు. గతంలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్గా పని పనిచేసిన ఆయన ప్రస్తుతం పలు బ్యాంకులకు న్యాయ సలహాదారునిగానూ పనిచేస్తున్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం ఆచ్చమ్మకుంటకు చెందిన టిడిపి సీనియర్ నాయకుడు రమావత్ రంగానాయక్ గుండెపోటుతో మృతి చెందగా భౌతికకాయాన్ని ఆ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.దారునాయక్ సోమవారం సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఆయన వెంట జీవ్లా నాయక్, ఆర్.చిన్నా నాయక్, లక్ష్మయ్య, ఆర్.బాలు, ఆర్.దేవ్లా నాయక్, రాంసింగ్, బి.దుర్గయ్య పాల్గొన్నారు.

సత్తెనపల్లి మండలంలో..

ఈపూరు మండలంలో..

పెదకూరపాడు మండలంలో..

'పల్లె పండుగ'లో పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పల్లెల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పల్లె పండుగలో భాగంగా గ్రామ సభల్లో ఆమోదించిన ఉపాధి హామీ పనులకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం శంకుస్థాపన చేశారు. మండలంలోని కట్టావారిపాలెంలో రూ.15 లక్షలతో మెటల్ రోడ్డుకు, కంటెపూడిలో రూ.20 లక్షలు, భీమవరంలో రూ.8 లక్షలతో సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. సర్పంచ్ ఎం.పార్వతి రాంబాబు, టిడిపి మండల అధ్యక్షులు ఎ.అమరేశ్వరరావు, ఎ.సాంబయ్య, గజానన, సుబ్బారావు, డి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఈపూరు

పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఈపూరు మండలం బోడెపూడివారిపాలెం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. గ్రామసభల్లో తీర్మానించిన రూ.10 లక్షల ఉపాధి హామీ నిధులతో సిపి రోడ్లు, డ్రెయినేజీలు, మినీ గోకులం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పనులను సంక్రాంతి నాటికి పూర్తిచేసి ప్రారంభిస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తామంతా బాధ్యత తీసుకుంటామని, రోడ్లపై గుంతలు పూడ్చడం, మరమ్మతులకు రూ.3 కోట్లతో త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. కొత్తగా తారురోడ్లు, సీసీ రహదారులు వేయడానికి నిధులు తెస్తామని చెప్పారు. అనంతరం మక్కెన మల్లికార్జునరావు మాట్లాడారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పల్లె పండుగ' కార్యక్రమాలు రొంపిచర్ల మండలంలో సోమవారం ప్రారంభమయ్యాయి. పరగటిచర్లలో మొదటి రోజు కార్యక్రమాన్ని పంచాయతీ రాజ్ ఎఇ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామంలో ఉపాధి హామీ కింద చేపట్టాల్సిన పనులు గురించి చర్చించారు. సైడ్ కాల్వల నిర్మాణం, రోడ్ల నిర్మాణం ఈ పథకం కింద చేపడతామని ఎఇ చెప్పారు. ఉపాధి హామీ ఎపిఎం ప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని 11 గ్రామాలకు గాను రూ.2.30 కోట్ల విడుదలైనట్లు ఎంపిడిఒ సరోజినీదేవి తెలిపారు. సోమవారం మల్లవరం, జెట్టిపాలెం గ్రామాల్లో రూ.30 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పిఆర్ ఏఈ వెంకటేశ్వర్‌రెడ్డి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ఉపాధి హామీ ఎపిఒ జై చంద్ర, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్, శ్రీనివాసరెడ్డి, ప్రభురాజు, మల్లయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో రూ.50 లక్షలతో నిర్మించే సిసి రోడ్డుకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శంకుస్థాపన చేశారు. స్థానిక అంబేద్కర్ సెంటర్ నుండి పంచాయతీ వరకు ఈ రోడ్డు నిర్మాణం జరగనున్నది. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి ఎ.రమేష్, సర్పంచి జి.రాజు, బి.రాంగోపాల్రావు, షేక్ ముంతాజు, షేక్ మిలిటరీ మౌలాలి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తదితరులు

తల్లిదండ్రుల కష్టాన్ని గమనించి చదవండి

విద్యార్థులకు ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి- మాచర్ల

పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని విద్యార్థులకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచించారు. ఆర్‌టిసి రిటైర్డు ఉద్యోగి ఆవుల వెంకటేశ్వర్లు సహకారంతో స్థానిక కోదండరామాలయ కళ్యాణ మండపంలో సోమవారం జరిగిన ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 10, ఇంటర్, ఎంసెట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థిని, విద్యార్థులకు నగదు, అవార్డుల ప్రదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివితేనే ర్యాంకులు సాధిస్తారనుకోవటం అపోహని, పట్టుదలతో కృషి చేస్తే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా మెరుగైన ర్యాంకు సాధిస్తారని అన్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో తమ స్తోమతకు మించి పిల్లల చదువుల కోసం ఖర్చు చేస్తున్నారని, వారి కష్టాన్ని గమనించి విద్యలో రాణించాలని సూచించారు. మాచర్లకు పిజి సెంటర్, పలు మెరగైన విద్యాసంస్థలు ఏర్పాటు అవసరమని పలువురు నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా అందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పి.నరసింహారావు, డాక్టర్ రామకోటయ్య, ఎనుమల కేశవరెడ్డి, కె.దుర్గారావు, జి.రామకృష్ణారావు, వై.వెంకట్రామయ్య, నాగూర్‌వలి పాల్గొన్నారు.

క్రోసూరు సర్కిల్ పరిధిలో మద్యం షాపులు వీరికే..

ప్రజాశక్తి - క్రోసూరు

మద్యం దుకాణాల కోసం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో సోమవారం జరిగిన లాటరీలో క్రోసూరు సర్కిల్ పరిధిలోని 10 షాపులను దక్కించుకున్న వారి వివరాలను ఎక్సైజ్ సిఐ టి.తులసి వెల్లడించారు. వీరు 16వ తేదీ నుండి షాపులు ఏర్పాటు చేసుకుంటారని చెప్పారు. క్రోసూరు మండలంలోని నాలుగు షాపులకుగాను నంబర్-71 షాపును సూరప్రసాద్, 72ను ఎంద్రాతి శ్రీనివాసరావు, 73ను షేక్ చిన్న జాన్ బాషా, 74ను మన్నెం వెంకటగురు, అచ్చంపేట మండలంలోని నాలుగు షాపుల్లో 75వ నంబర్ షాపును ఆకుల కృష్ణ, 76ను దావులూరి అనిల్ కుమార్, 77ను గంధం వెంకట శివప్రసాద్, 78ను పొన్నెకంటి రవిచంద్రశేఖర్ దక్కించుకోగా బెల్లంకొండ మండలంలోని 79వ నంబర్ షాపును కె.వి.ఎన్ వరప్రసాద్, 80ను ఎంద్రాతి శ్రీనివాసరావు దక్కించుకున్నట్లు సిఐ వివరించారు.

కాల్వలో దూకిన యువకుడు మృతి

ప్రజాశక్తి- మాచర్ల

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని యువకునిపై పోక్సో కేసు నమోదు కాగా అతను శనివారం కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని రాయవరానికి చెందిన ఉప్పుతోళ్ళ శ్రీనివాసరావు(23) ఆదే గ్రామానికి చెందిన బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించటంతో బాలిక తల్లిదండ్రులు మాచర్ల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు శ్రీనివాసరావుపై పోక్సో కేసు నమోదు చేయటంతో అతను బైక్‌పై కంభంపాడు బ్రిడ్జి వద్దకెళ్లి నాగార్జున సాగర్ కుడికాల్వలో దూకాడు. మృతదేహాన్ని బుగ్గవాగు రిజర్వాయర్ వద్ద సోమవారం గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

తెలంగాణ డీఎస్సీలో రెంటచింతల వాసికి ఫస్ట్ ర్యాంకు

ప్రజాశక్తి - రెంటచింతల

తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో రెంటచింతలకు చెందిన షేక్ అలీమ్‌బాష నల్గొండ జిల్లా స్థాయిలో హిందీలో ఫస్ట్ ర్యాంకు సాధించాడు. హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి నుండి నియామక పత్రాన్ని బాష అందుకున్నారు. బాష రెంటచింతలలోని సెంట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల, సాగరమాత జూనియర్ కళాశాలలో చదువుకున్నారు. ఇప్పటికే నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేటలోని మైనార్టీ గురుకులంలో హిందీ (టీజీటీ)గా పని చేస్తున్నారు. బాషాకు కుటుంబ సభ్యులతోపాటు స్థానికులు శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలకు విశ్రాంత పిఇటి వితరణ

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని తిమ్మాపురం జెడ్‌పి పాఠశాలకు ఇటీవల ఉద్యోగ విరమణ చేసి పిఇటి కె.కృష్ణన్, ఆయన భార్య రాజేశ్వరి కలిసి రూ.30 వేలతో మల్టీఫంక్షన్ ప్రింటర్, మైక్‌సెట్‌ను బహూకరించారు. వీటిని పాఠశాలకు సోమవారం అందించారు. ఆయనకు హెచ్‌ఎం వెంకటాద్రి నాయుడు, సర్పంచ్ పి.ప్రభావతి, ఉపాధ్యాయులు గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

తూకాల్లో మోసాలకు చెక్ పెడుతున్న లీగల్ మెట్రాలజీ

అక్రమార్కులకు పెనాలిటీ - 227 కేసులు నమోదు

ఇప్పటికి రూ.16.50 లక్షలకు పైగా వసూళ్లు

ప్రజాశక్తి-తెనాలి

విపణి వీధిలో నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న తూకాల్లో మోసాలకు లీగల్ మెట్రాలజి అధికారులు చెక్ పెడుతున్నారు. ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తూ, అక్రమార్కులపై కొరడా ఝుళిపిస్తున్నారు. కూరగాయలు, మాంసాహారం, నూనెలు, నిత్యావసరాలు ..ఇలా ఒకటేమిటి.. అన్నింటినీ ఓ కంట కనిపెడు తున్నారు. దగా కోరులపై కేసులు నమోదు, గణనీ యంగా అపరాద రుసుం వసూలు చేస్తున్నారు. లీగల్ మెట్రా లజీ విభాగం తెనాలి డివిజన్‌లో ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సాధించిన ప్రగతి వివరాలిలా ఉన్నాయి.

మాంసాహార దుకాణంలో, కిరాణాషాపులో తూకాలు తనిఖీ చేస్తున్న అధికారులు

లీగల్ మెట్రాలజీ శాఖ తెనాలి డివిజన్ పరిధిలో మొత్తం ఎనిమిది మండలాలున్నాయి. తెనాలి, కొల్లిపర, మంగళగిరి, దుగ్గిరాల, తాడేపల్లి, పొన్నూరు, చేబ్రోలు, కాకుమాను మండలాలు తెనాలి డివిజన్ పరిధిలోనివే. డివిజినల్ ఇన్‌స్పెక్టర్‌గా బొలిశెట్టి శేషసాయి పనిచేస్తున్నారు. ప్రతి ఏటా ప్రభుత్వం శాఖాపరంగా రెవెన్యూ సేకరణకు సిబ్బందికి దిశానిర్ధేశం చేస్తుంది. ప్రతి ఏడాది గతేడాదితో పోల్చి దానికి ఐదు శాతం అదనంగా వసూలు చేయాలన్నది లక్ష్యం. దీనికి అనుగుణంగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. వాస్తవంగా ఆకస్మిక తనిఖీలలో తూకాల్లో మోసం చేస్తున్న వ్యాపారులను గుర్తించి వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేయటం, తూకాల్లో జరిగే మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించి వారిని అప్రమత్తం చేయటం అధికారుల విధి. అలాగే విక్రయించే ప్రతి వస్తువుపై తయరీ తేది, ఎక్స్పైరీ తేది, బరువు, ధర, బ్యాచ్ నెంబరు విధిగా ఉండాలి. దానికి భిన్నంగా వ్యవహరించిన వారిపై కూడా లీగల్ మెట్రాలజీ అధికారులు కేసులు నమోదు చేస్తారు. వ్యాపారులు ఉపయోగించే తూకాలకు, తూకం రాళ్ళకు స్టాంపింగ్ అనివార్యం. స్టాంపింగ్‌కు కూడా రుసుము వసూలు చేస్తారు. ఇక లక్ష్య సాధనలో భాగంగా డివిజినల్ అదికారి వారంలో మూడు రోజులు తనిఖీలు లక్ష్యంగా పనిచేస్తున్నారు. డివిజన్‌లోని ప్రతి మండలంలో వ్యాపార కూడళ్ళలో జరిగే మోసాలపై తనిఖీలు నిర్వహిస్తున్నారు. అధికారుల గణాంకాల ప్రకారం గతేడాది పరిశీలిస్తే 286 కేసులు నమోదు చేశారు. అపరాధ రుసుము రూపంలో రూ.17,25,465, ముద్రణా రుసుం రూ.16,70,600 వసూలు చేశారు. దీనికి అదనంగా 5శాతం పైబడి 2024-25 ఆర్థిక సంవత్సరంలో రెవిన్యూ వసూలు చేయాల్సి ఉంది. దీనికి అనుగుణంగా ఈ ఏడాది సెప్టెంబర్ నెలాఖరు వరకూ పరిశీలిస్తే 227 కేసులు నమోదు చేశారు. అపరాధరుసుం రూపంలో రూ.9.79 లక్షలు, ముద్రణా రుసు రూ.6,83,730 వసూలు చేశారు. గతేడాది సెప్టెంబరు ముగింపు నాటికి 124 కేసులు నమోదు చేసి రూ.5.43లక్షలు అపరాద రుసుం, రూ.6,83,655 ముద్రణా రుసుం వసూలు చేశారు.

ఇప్పటి వరకూ 227 కేసులు నమోదు

బొలిశెట్టి శేషసాయి, డివిజినల్ ఇన్‌స్పెక్టర్, లీగల్ మెట్రాలజి, తెనాలి

వారంలో మూడు రోజులు కార్యాలయంలో వివిధ పనుల్లో నిమగ్నమైనా, మూడు రోజులు ఖచ్చితంగా డివిజన్‌లో క్యాంపులు నిర్వహించి, ఆకస్మిక తనిఖీలు చేస్తుంటాము. ముఖ్యంగా ఇటీవల వంట నూనెల ధరలు పెరగటంతో పాత సరకును కొత్త ధరలకు విక్రయిస్తున్న సమాచారంతో దాడులు చేశాం. పామాయిల్ పాత ధర రూ.116 ఉండగా, అది ఇప్పుడు రూ.125కు పెరిగింది. పాత సరకును పెరిగిన ధరలకు విక్రయిస్తుండటంలో ఎనిమిది కేసులు నమోదు చేశాం. ఈ ఏడాది ఏప్రిల్ మొదలు సెప్టెంబర్ ఆఖరు వరకూ 227 కేసులు నమోదు చేశాం. రూ.9.79లక్షలు అపరాధ రుసుం వసూలు చేశాం. ముద్రణా రుసుం రూ.6,83,730 వసూలు చేశాం.

తాడేపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటలూ వైద్య సేవలు

ప్రజాశక్తి-తాడేపల్లి :తాడేపల్లి పట్టణంలోని సీతానగరం ప్రభుత్వ వైద్యశాలలో ప్రజలకు 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో అందిస్తున్నట్లు ఆసుపత్రి ప్రధాన వైద్యులు ఈ శాంత కుమా రి తెలిపారు. సోమవారం ఆమె ప్రజాశక్తి తో మాట్లాడారు. ప్రజలు ఎటువంటి అనారోగ్య పరిస్థితులు ఎదురైన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు పొందవచ్చు అని సూచించారు. హాస్పటల్లో ఇద్దరు మహిళా డాక్టర్లు అందుబాటులో ఉండటంతో గైనకాలజిస్ట్ సేవలు త్వరితగతిన చేయడానికి వీలుంటుందని వివరించారు. అనుకోని విధంగా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితిని బట్టి విజయవాడ, గుంటూరు తదితర నగరాలకు రోగులను పంపించడం జరుగుతుందని చెప్పారు. ఇటీవల వివిధ ప్రాంతాల్లో వీధి కుక్కలు అధికంగా సంచరిస్తూ ప్రజలను కరుస్తూ ఇబ్బందులు పెడుతున్నాయని తమ దృష్టికి వచ్చిన సంగతి వివరించారు. ఇందుకోసం కుక్క కాటు నివారణకు ఇంజక్షన్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రతిరోజు తాడేపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో 150 మంది వరకు ఔట్ పేషెంట్ల విభాగంలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. షుగర్, బిపి తదితర వ్యాధులకు సంబంధించి మందులన్నీ ఉచితంగా రోగులు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ఈ ప్రాంత ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా వైరల్ ఫీవర్స్ ఎక్కువగా ఉన్న సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఇంటి చుట్టూ. మరియు డాబాలపైన కొబ్బరి బోండాలు. పాత టైర్లు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. వాటిల్లో నీరు చేరి డెంగి మరియు ఇతర జ్వరాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రో గం వచ్చాక బాధపడే కంటే రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం మేలని చెప్పారు.

యూనివర్సిటీల్లో వీసీలుగా బీసీలను నియమించాలి : కేశన

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం, 17 విశ్వవిద్యాలయాల వైస్- ఛాన్సలర్ల నియా మకాలలో వెనుకబడిన తరగతులకు చెందిన ప్రొఫెసర్లను, బీసీల జనాభా దామాషా మేరకు 8 మందికి తగ్గకుండా వైస్-ఛాన్సలర్లు గా నియమించాలని, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ఒక ప్రకటనలో కోరారు. యూనివర్సిటీలలో నియమించే రెక్టార్, రిజిస్ట్రార్, ఇతర నామినేటెడ్ పోస్టులు, విశ్వవిద్యాలయాల పాలకమండలి సభ్యులుగా బీసీ వర్గాలకు చెందిన వారిని 35 శాతానికి తగ్గకుండా నియమించాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాలు, విశ్వవిద్యాలయాలలో ఎస్సీ, ఎస్టీల వలెనే బీసీ ల బ్యాక్లాగ్ పోస్టులను గుర్తించి, వెంటనే భర్తీ చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని యూనివర్సిటీల వైస్- ఛాన్సలర్లను, ఇతర అన్ని నామినేటెడ్ పోస్టులలో ఆనాటి ముఖ్యమంత్రి సామాజిక వర్గం వారిని నియమించుకోవడంతో, ఇతర సామాజిక వర్గాలకు, ముఖ్యంగా జనాభాలో 54 శాతం ఉన్న బీసీలకు చాలా అన్యాయం జరిగిందన్నారు.

పలు గ్రామాల్లో 'పల్లె పండుగ' ప్రారంభం

ప్రజాశక్తి - దుగ్గిరాల :అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగ స్వాములు కావాలని వక్తలు తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని వీర్లపాలెం పెద్ద కొండూరు గొడవర్రు గ్రామాలలో 40 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌ఛార్జి ఎంపీపీ షేక్ జబీన్, డిపిఓ నాగ సాయికుమార్, ఎంపీడీవో అడిగోపుల శ్రీనివాసరావు ఈ ఓ పి ఆర్ డి కావూరి జవహర్లాల్ నెహ్రూ గొడవర్రు సర్పంచ్ విశ్వనాథపల్లి ఉమాదేవి పెద్ద కొండూరు సర్పంచ్ మేదరి సౌజన్య తదితరులు మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని తెలిపారు.

ప్రజాశక్తి - తాడికొండ : ప్రభుత్వ ఆదేశాల మేరకు పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సోమవారం కంతేరు , పొన్నెకల్లు, దామరపల్లి , ఫణిదరం గ్రామాలలో స్థానిక శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ సీసీ రహదారులకు శంకుస్థాపన చేశారు .ఉపాధి హామీ నిధులు రూ.75 లక్షలతో సీసీ రహదారులను నిర్మించనున్నారు. పొన్నెకల్లు గ్రామంలో శ్రావణ్ కుమార్‌కు ఘన స్వాగతం పలికారు. ఎడ్ల బండి పై ఊరేగించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తలసిల ప్రసన్న , గుంటుపల్లి మధుసూదన్ రావు , నెల్లూరు కాంతారావు , తోకల వెంకటేశ్వర్లు, బేతపూడి విజయ్ శేఖర్, సర్పంచులు నూకతోటి మేరెమ్మ ,కర్నాటి బాల కోటేశ్వరరావు, ఎంపీడీవో సమతా వాణి, ఏపీవో కిరణ్మయి పాల్గొన్నారు.

ప్రజాశక్తి చేబ్రోలు : మండలంలో నేటి నుండి పల్లెపండుగ కార్యక్రమాలు నిర్వ హిస్తామని ఎంపిడిఓ కె లలిత తెలియ జేశారు.ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఈ మూడు రోజుల్లో మండల వ్యాప్తంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి గ్రామాల్లో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. రూ. 112 లక్షల అంచనాతో వేజెండ్ల , సుద్ధపల్లి శలపాడు వీ ఎన్ పాలెం, శేకూరు, చేబ్రోలు, గొడవర్రు, నారాకోడూరు , వడ్లమూడి, శ్రీరంగాపురం తోట్లపాలెం మంచాల గ్రామాలలో అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణము చేపట్టనున్నట్లు తెలిపారు.

దుగ్గిరాలలో

తాడికొండలో

మహారాష్ట్ర పోలీసుల అదుపులో తాడేపల్లి, ఉండవల్లి యువకులు

ప్రజాశక్తి-తాడేపల్లి

మహారాష్ట్రకు చెందిన పోలీసులు తాడేపల్లి పోలీసుల సహకారంతో ఉండవల్లి, తాడేపల్లికి చెందిన ఇద్దరు యువకులను సోమవారం అదుపులోకి తీసుకున్నారు. మరి కొంతమంది కోసం గాలిస్తున్నారు. ఈ సంఘటన తాడేపల్లిలో హాట్ టాపిక్ గా మారింది. దీనికి సంబంధించి తాడేపల్లి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల మహారాష్ట్రలో వాణిజ్య నగరమైన ముంబైతో పాటు పలు నగరాల్లో దొంగతనానికి పాల్పడిన నిందితులు రాష్ట్రంలోని తాడేపల్లి, ఉండవల్లిలో ఉన్నట్లు సిసి టీవీ ఫుటేజీల ఆధారంగా మహారాష్ట్ర పోలీసులు గుర్తించారు. సుమారు 10 లక్షలు విలువ చేసే బంగారం, చీరలు దొంగిలించినట్లు పక్కా సమాచారంతో మహారాష్ట్ర పోలీసులు తాడేపల్లి చేరుకున్నారు. పలువురు అనుమానితుల ఇళ్లల్లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఇందుకు తాడేపల్లి పోలీసుల సహకారం తీసుకున్నారు. పట్టుబడిన యువకులపై దేశవ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లో పెద్ద ఎత్తున కేసులు ఉన్నట్లు మహారాష్ట్ర పోలీసులు చెబుతున్నారు. వివరాలు వారు వెల్లడించాల్సి ఉంది.

పంచాయతీ రాజ్ అధికారిగా రవికుమార్

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు నూతన పంచాయతీ రాజ్ శాఖ అధికారిగా సోమవారం జి రవి కుమార్ బాధ్యతలు స్వీకరించారు. నుజండ్ల మండలం నుంచి బదిలీపై పత్తిపాడు వచ్చినట్లు తెలిపారు. గతంలో ఇక్కడ పని చేసిన మోషే రిటైర్డు అవ్వగా అప్పటి నుండి నడింపాలెం పంచాయతీ కార్యదర్శి షేక్.ఖాజా ఇంచార్జ్ అధికారిగా పని చేశారు.

జనసేన పార్టీకి జెఎస్ఆర్ రాజీనామా

ప్రజాశక్తి - మంగళగిరి

జనసేన రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పదవికి, క్రియశీల సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు జంజనం వెంకట సాంబశివరావు సోమవారం తెలిపారు. తన రాజీనామాని జనసేన నియోజకవర్గ ఇంచార్జి చిల్లపల్లి శ్రీనివాసరావుకి ఇచ్చినట్టు ఒక ప్రకటనలో తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న నిర్వాహకులు

మంగళగిరిలో ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - మంగళగిరి

శంకర నేత్రాలయ కంటి వైద్యశాల చెన్నై, రాఘవరపు వసుంధర సోదరులు కొట్టి వాయునందనరావు, కొట్టి రామానుజరావు, రామ్ కొట్టి (అమెరికా) వారి సంయుక్త సహ కారంతో మంగళగిరిలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవస్థానం గాలి గోపురం ఎదురు వీధిలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ కే శకుంతల, పట్టణ సీఐ డి వినోద్ కుమార్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డెవలప్మెంట్ డైరెక్టర్ కందుల నాగార్జున సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22వ తేదీ వరకు జరిగే వైద్య శిబిరంలో కంటి ఆపరేషన్లు చేస్తారని, మంగళగిరి నియోజకవర్గం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చికిత్స అనంతరం లెన్స్ కంటి అద్దాలు, మందులు ఉచితముగా ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గోవాడ దుర్గారావు, వాకా మాధవరావు గౌడ్, అన్నం నాగబాబు, పందేటి తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో జిఎంసిలో కంట్రోల్ రూమ్

ప్రజాశక్తి-గుంటూరు

వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు భారీ వర్షాల నేపథ్యంలో గుంటూరు నగరంలో ప్రజలు తమ ప్రాంతాల్లో సమస్యలను తెలియచేయడానికి గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో 0863-2345105 కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేసేలా ఏర్పాటు చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు వర్షాల వల్ల ఏ సమస్య ఎదురైనా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందిస్తే తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కంట్రోల్ రూమ్‌లో 3 షిఫ్ట్‌లుగా సిబ్బందిని కేటాయించామని తెలిపారు. వర్షాలకు రోడ్లపై చెట్లు పడితే తొలగించడానికి వీలుగా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఏడిహెచ్‌ని, తాగునీటి పంపింగ్ రిజర్వాయర్లలో విద్యుత్ అంతరాయం వలన సరఫరాకి ఇబ్బంది రాకుండా ముందస్తుగా జనరేటర్లు ఏర్పాటు చేసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించామని తెలిపారు. వర్షాల తీవ్రత పెరిగి లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరితే నీటిని బెయిల్ అవుట్ చేయడం, స్థానిక ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడానికి సిద్ధంగా ఉండాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు.

ఎంఎ టీవీ అండ్ ఫిలిం స్టడీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో టీవీ అండ్ ఫిల్మ్ స్టడీస్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ జె . మధుబాబు తెలిపారు. రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేషన్ విధానంలో ఈ కోర్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫిలిం మేకింగ్ లో ఆసక్తి ఉన్నవారు, సినిమా రంగంపై సమగ్ర అవగాహన పెంచుకోవాలనుకునే వారు దరఖాస్తులు చేసుకోవచ్చని వివరించారు. ఈ కోర్సులో డాక్యుమెంటరీ, ఆర్ట్ ఆఫ్ ఫిల్మ్ డైరెక్షన్, క్రియేటివ్ లైటింగ్, ఎడిటింగ్, స్క్రీన్ రైటింగ్, స్టోరీ బోర్డ్, సినిమాటోగ్రఫీ, ఫిలిం గ్రామర్ వంటి సబ్జెక్టులను బోధిస్తామన్నారు. యు జి సి ఆదేశాల మేరకు నూతన విద్యా విధానంలో బోధనతో పాటు 50% ప్రాక్టికల్స్ ఉంటాయన్నారు. ఈ కోర్సులో ప్రవేశాలు పొందేందుకు ఏదైనా డిగ్రీ కోర్స్ ఉత్తేర్ణులై ఉండాలని సూచించారు. కోర్సులో ప్రవేశాలకు, మరిన్ని వివరాలకు 9393110848 ఫోన్ నెంబర్ ను సంప్రదించాలని డాక్టర్ మధుబాబు సూచి ంచారు.

డిహెచ్‌ఎల్ షిప్‌మెంట్లపై 50 శాతం డిస్కౌంట్

ప్రజాశక్తి-గుంటూరు

దీపావళి సందర్భంగా అంతర్జాతీయ ఎక్స్‌ప్రెస్ సర్వీసులో గ్లోబల్ లీడర్ అయిన డీహెచ్‌ఎల్ ఎక్స్‌ప్రెస్ అంతర్జాతీయ, డొమెస్టిక్ షిప్మెంట్లపై డిస్కౌంట్లను అందిస్తున్నట్లు డీహెచ్‌ఎల్ ఎక్స్‌ప్రెస్ ఇండియా సేల్స్ అండ్ మార్కెటింగ్ వైస్‌ప్రెసిడెంట్ సందీప్ జునేజా ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 2 వరకూ ఈ ఆఫర్ ఉంటుందని, కస్టమర్లు ప్రపంచవ్యాప్తంగా వారికి ఆత్మీయులకు పండుగ శుభాకాంక్షలు, బహుమతులు పంపించడానికి సహాయపడుతుందన్నారు. అంతర్జాతీయ షిప్మెంట్లపై 50శాతం, దేశీయ షిప్‌మెంట్లపై 40 శాతం తగ్గింపు అందిస్తున్నట్లు చెప్పారు. స్టోర్‌లో ఆఫర్ పొందటానికి ఎంచుకున్న కస్టమర్లు తమ షిప్‌మెంట్ బుక్ చేసేటప్పుడు DIWALI50 అనే ప్రోమో కోడ్‌ను ఉపయోగించాల్సి ఉంటుందన్నారు. కస్టమర్లు 3 కిలోలనుండి 25 కిలోల మధ్య బరువున్న ఇంటర్నేషనల్ షిప్మెంట్లపై 50శాతం, 2 కిలోల నుండి10 కిలోల మధ్య బరువున్న దేశీయ షిప్‌మెంట్లపై 40శాతం డిస్కౌంట్ అందిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 650 డీహెచ్‌ఎల్ ఎక్స్ప్రెస్ సర్వీస్ పాయింట్లలో ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందన్నారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఎన్‌జి రంగా సాహిత్య పురస్కారానికి విజేతలు ఎంపిక

ప్రజాశక్తి-గుంటూరు

ఆచార్య ఎన్‌జి రంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2024వ సంవత్సరానికి సాహిత్య పురస్కారాల ఎంపిక పూర్తయిందని ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ జక్కంపూడి సీతారామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఎన్‌జి రంగా సాహిత్య పురస్కారం కోసం రెండు రాష్ట్రాల నుండి నవలలను ఆహ్వానించగా వి.శాంతిప్రబోధ రచించిన 'బతుకు సేద్యం'కు ప్రథమ బహుమతి, సి.సుజాత రాసిన 'పచ్చబొట్టు'కు ద్వితీయ బహుమతి, చంద్రలత రాసిన 'నీలంపు రాసి' విశిష్ట బహుమతికి ఎంపికైనట్లు చెప్పారు. ప్రథమ బహుమతికి రూ.10వేలు, ద్వితీయ బహుమతికి రూ.5వేలు నగదు బహమతి ఇవ్వటం జరుగుతుందన్నారు. విజేతలకు నవంబర్ 7న స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో ఆచార్య ఎన్.జి రంగా జయంతి వేడుకల సభలో సత్కారంతో పాటు బహుమతి ప్రధానం అందజేయడం జరుగుతుందని సీతారామారావు తెలియజేశారు.

నేడు తేళ్ల నారాయణ 2వ వర్ధంతి సభ

మహిళలకు కుట్టు శిక్షణ 3వ బ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి - పెదనందిపాడు

ప్రజా నాయకులు తేళ్ల నారాయణ రెండవ వర్ధంతి సభ పెదనందిపాడు లోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో మంగళవారం సాయంత్రం 3.30 గంటలకు జరుగుతుందని విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు కుట్టు శిక్షణ మూడవ బ్యాచ్ ప్రారంభిస్తామని తెలిపారు. ముఖ్యఅతిథిగా శాసన మండలి సభ్యులు కే ఎస్ లక్ష్మణరావు, గుంటూరు జాషువా విజ్ఞాన కేంద్రం ట్రస్టీ పాశం రామారావు, మాజీ ఎంపీపీలు నర్రా బాలకృష్ణ తదితరులు హాజరవుతారని, ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని దొప్పలపూడి రమేష్‌బాబు సోమవారం ప్రకటనలో తెలిపారు.

ఏపీ లాసెట్-2024 అడ్మిషన్స్ నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ లా సెట్, పీజీ లాసెట్ 2024కు సంబంధించిన అడ్మిషన్స్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు లా సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి సత్యనారాయణ తెలిపారు. ఏపీలోని న్యాయశాస్త్ర కళాశాలలో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రవేశాల కౌన్సెలింగ్, రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సోమవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.గంగాధర రావు విడుదల చేశారని పేర్కొన్నారు. ఈనెల 16 నుండి 20 వరకు వెబ్ కౌన్సెలింగ్, రిజిస్ట్రేషన్ నమోదు జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్ ద్వారా ఈనెల 22 నుండి 25 వరకు కళాశాలలను ఎంపిక చేసుకోవచ్చని, వెబ్ అప్షన్‌లో మార్పులు ఈనెల 26 న చేసుకోవచ్చనని పేర్కొన్నారు. అలాగె స్పెషల్ కేటగిరీకి చెందిన అభ్యర్థులు ఈనెల 19న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ప్రవేశాల విభాగం వద్ద ఎ. పి.లాసెట్ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు. ఈనెల 28న అడ్మిషన్ల అలాట్ మెంట్ జరుగుతుందని తెలిపారు. ఆయా కళాశాలలో ప్రవేశం పొందిన అభ్యర్థులు ఈనెల 29, 30 తేదీలలో హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్ ఛార్జ్ రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, ఇన్ ఛార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ గ్రీవెన్స్‌కు 80 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

అర్జీలు స్వీకరిస్తున్న డిఆర్‌ఒ, ఇతర అధికారులు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందించిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అందించిన ఫిర్యాదులను జిల్లా రెవెన్యూ అధికారిణి పెద్ది రోజా, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి, సమగ్ర శిక్ష అడిషినల్ కో-ఆర్డినేటర్ విజయలక్ష్మి, గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన 80 దరఖాస్తులను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారిణి అధికారులను కోరారు. కాగా ఎడతెరిపి లేని వర్షంతో గ్రీవెన్స్‌కు అర్జీదారుల సంఖ్య తగ్గింది. ఉదయం నుండి వర్షం కొనసాగుతుండటంతో గ్రీవెన్స్‌కు వచ్చే సంఖ్య సగం కూడా దాటలేదు. సాధారణంగా ప్రతి సోమవారం 250కిపైగా అర్జీలు అందుతున్నాయి. ఈవారం మాత్రం 80 మందే అర్జీలు అందజేశారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో గిరిజన సంక్షేమ శాఖలోని అవినీతి హాస్టల్ వెల్ఫేర్ అధికారులపై చర్యలు తీసుకోవాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి.చంద్రానాయక్ గ్రీవెన్స్‌లో అర్జీ అందజేశాడు. పోస్ట్ మెట్రిక్ బాలుర వసతి గృహం-2లో విద్యార్థుల ఫిర్యాదు మేరకు ఎసిబి అధికారులు గత సంవత్సరం జులైలో తనిఖీ చేశారని, కానీ సదరు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎలాంటి చర్యా నేటికీ తీసుకోలేదన్నారు. ఆగస్టులో అధికారుల షోకాజు నోటీసుకూడా సదరు అధికారి ఎలాంటి సమాధానం ఇవ్వలేదని, అయినా అధికారులు చర్యలూ తీసుకోకపోవటం శోచనీయం అన్నారు. ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల అండతో కేసును తారుమారు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాడన్నారు. 2023 జులై నుండి టిడిడబ్ల్యూఓలుగా ఉన్న మధుసదన్‌రావు, ఆర్‌డిఒ ప్రభాకర్‌రెడ్డి, దుర్గాబాయి లక్ష్మీకుమారి 2022, 23 సంవత్సరాలకు సంబంధించి వివాదంలో ఉన్న వసతి గృహం డైట్ బిల్లులలో ఆవినీతి ఉందని తెలుసుకొని డైట్ బిల్లులు చెల్లించకుండా నిలిపివేశారని, అయితే తర్వాత వచ్చిన డిటిడబ్ల్యూఒ శిరీష నిజానిజాలు పరిశీలించకుండా 2022 డైట్ బిల్లులు 2024లో మంజూరు చేసిందన్నారు. కావున సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జిఎంసి గ్రీవెన్స్‌కు 35 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

గ్రీవెన్స్‌లో నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలు ప్రతి సోమవారం అందిస్తున్న అర్జీలను మళ్లీ మచ్చే సోమవారం నాటికి పరిష్కరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారుల్ని అదేశించారు. సోమవారం జిఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్ గ్రీవెన్స్ నిర్వహించిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి అర్జీ సమగ్రంగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్జీలు పునరావృతం కాకుండా, నాణ్యమైన పరిష్కారానికి విభాగాది పతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జిఎంసి కార్యాలయానికి వస్తున్నారని, అవి స్థానికంగానే పరిష్కారం చేయాలన్నారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో 35 ఫిర్యాదులు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 11, ఇంజినీరింగ్ విభాగం 8, రెవెన్యూ విభాగం 7, ప్రజారోగ్య విభాగం 5, అకౌంట్స్ విభాగంకి సంబందించి 6, ఉపాసెల్ కి సంబందించి 1ఫిర్యాదు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్.ఈ. నాగమల్లేశ్వరరావు, ఎం హెచ్ఓ డాక్టర్ రవి, మేనేజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పార్క్ కార్మికులకు రక్షణ పరికరాలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని పార్కులలో పనిచేసే కార్మికులు తగిన రక్షణ పరికరాలు వినియోగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం జిఎంసి కౌన్సిల్ హాల్లో జిఎంసి పార్క్ కార్మికులకు రక్షణ పరికరాలను అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జిఎంసి పరిధిలోని వివిధ విభాగాల కార్మికులు ప్రజారోగ్యం, మౌలిక వసతుల కోసం ఎంతో కష్టపడుతున్నారని అటువంటి కార్మికులకు నగర పాలక సంస్థ అండగా నిలుస్తుందన్నారు. కార్మికుల భద్రతకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. పార్క్ విభాగంలోని కార్మికులకు విధుల్లో వినియోగించే హ్యాండ్ గ్లౌజులు, లాంగ్ బూట్లు, రెయిన్ కోట్లు, హెల్మెట్లు వంటి రక్షణ పరికరాలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు రక్షణ పరికరాలు అందజేస్తున్న కమిషనర్

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, పరిశుభ్రతకు కషి చేస్తున్న నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. సోమవారం 23వ డివిజన్ నగరంపాలెంలో ఆడిటర్ గోపికృష్ణ ఆధ్వర్యంలో మహిళా శానిటరీ సిబ్బందికి ఆమె దుస్తులు పంపిణీ చేశారు. మాధవి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు కరోనాలో ప్రాణాలను లెక్క చేయకుండా వీధులు శుభ్రం చేశారన్నారు.నగర పరిశుభ్రతపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని కార్మికులకు సూచించారు. కార్మికులు పారిశుధ్య పనులు చేస్తూ తీవ్రమైన దుర్గంధాల నుంచి ప్రజలను కాపాడుతూ విశిష్ట సేవలు అందిస్తున్నారని ఎమ్మెల్యే కొనియాడారు. దాతత్వముతో ముందుకు వచ్చి కార్మికులకు దుస్తులు పంపిణి చేసిన ఆడిటర్ గోపికృష్ణను అభినందిస్తున్నట్లు ఎమ్మెల్యే గళ్ళ మాధవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శనకాయల అరుణ, సాధు రాజేష్, లామ్ వర్ధన్ రావు, దళవాయి కిషోర్, గంటా పెద్దబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి